వార్త

ఆదివారం

13 జులై, 2025

ఆయుధ దాహం..

అవనికి శాపం

‘ఈ నగరానికి ఏమైంది?’ సీక్వెల్‌లో బాలయ్య

యువతను విపరీతంగా ఆకట్టుకున్న ‘ఈ నగరానికి ఏమైంది?’ సినిమాకు సీక్వెల్ రాబోతోంది. దర్శకుడు తరుణ్ భాస్కర్ ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించగా, దీనికి సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త ఇప్పుడు టాలీవుడ్‌లో చక్కర్లు కొడుతోంది. ‘ఈNఈ రిపీట్’ పేరుతో రానున్న ఈ సీక్వెల్‌లో నందమూరి బాలకృష్ణ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.

‘ఈ నగరానికి ఏమైంది?’ చిత్రం యూత్‌లో మంచి గుర్తింపు ఉన్న చిత్రంగా నిలిచిపోయింది. దీని సీక్వెల్ కోసం అభిమానులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. వారి నిరీక్షణకు తెర దించుతూ తరుణ్ భాస్కర్ ఇటీవల ఈ చిత్రాన్ని ప్రకటించారు. అయితే, ఈ సీక్వెల్‌లో నటసింహం బాలకృష్ణ నటించనున్నారనే వార్త సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. నటుడు విష్వక్సేన్‌కు బాలకృష్ణ అంటే విపరీతమైన అభిమానం అన్న సంగతి తెలిసిందే. ఆ అభిమానంతోనే విష్వక్ ఈ సినిమాలో నటించాలని బాలకృష్ణను వ్యక్తిగతంగా కోరగా, ఆయన వెంటనే అంగీకరించినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. మొదటి భాగంలో నవ్వులు పూయించిన విష్వక్సేన్, సాయి సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమఠం, వెంకటేశ్ కాకుమాను ఈ సీక్వెల్‌లోనూ తమ పాత్రలను కొనసాగించనున్నారు.

ప్రముఖ నిర్మాణ సంస్థ సురేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై డి.సురేశ్‌బాబు, సృజన్ యరబోలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మొదటి భాగానికి అద్భుతమైన సంగీతం అందించిన వివేక్ సాగర్ ఈ సీక్వెల్‌కు కూడా స్వరాలు సమకూర్చనున్నారు. అయితే, ఈ చిత్రంలో బాలకృష్ణ నటిస్తున్నారన్న వార్తలపై అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇందులో ఎంతవరకు నిజముందో తెలియాలంటే మరికొంత సమయం వేచి చూడాల్సిందే.

తారాతీరం

అతిథి పాత్రలో అమీర్‌ఖాన్?

సూపర్ స్టార్ రజనీకాంత్, అక్కినేని నాగార్జున, విభిన్న చిత్రాల దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబోలో ‘కూలీ’ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఆగస్టులో వరల్డ్ వైడ్‌గా విడుదల కాబోతున్న ఈ సినిమాపై అభిమానులతో పాటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అనిరుధ్ రవిచంద్రన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. దీంతో మ్యూజిక్ పరంగా కూడా ఈ చిత్రం సంచలనం సృష్టించడం ఖాయమనే నమ్మకం ఏర్పడింది. గతంలో రజనీ, అనిరుధ్ కాంబోలో వచ్చిన ‘జైలర్’ చిత్రంలోని ‘హుకుం’ సాంగ్ సృష్టించిన సంచలనం తెలిసిందే. రీసెంట్‌గా ‘కూలీ’ నుంచి ‘చికిటు’ అనే మాస్ సాంగ్ విడుదలైంది. రజనీ ఇమేజ్‌కి తగ్గట్టుగా సాగిన సాంగ్ ట్యూన్, లిరిక్స్ అభిమానులతో పాటు ప్రేక్షకులని ఉర్రూతలూగిస్తున్నాయి. అనిరుధ్ మాట్లాడుతూ ‘చికుటు’ పాటకి డాన్స్ చెయ్యడానికి రజనీ ఎంతగానో కష్టపడ్డారు. ఒక సవాలుగా తీసుకొని తన వింటేజ్ స్టైల్లో అద్భుతంగా డాన్స్ చేసారు. ముప్పై యేళ్ల క్రితం రజనీ ఎలా డ్యాన్స్ చేసారో ఇప్పుడు అలాగే చేసారని అనిరుధ్ అన్నారు.

‘జైలర్’ని నిర్మించిన సన్ పిక్చర్స్ ‘కూలీ’ని భారీ వ్యయంతో నిర్మిస్తుండగా శృతిహాసన్ హీరోయిన్‌గా చేస్తోంది. ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, సత్యరాజ్ మొదలైనవారు కీలక పాత్రలు పోషించారు. ఇందులో పూజాహెగ్డే ప్రత్యేక గీతంలో అలరించనుండగా, అగ్ర హీరో అమీర్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడు.

ఆదివారం వార్త

13 జులై, 2025

మంచి ముత్యాలు

రోజంతా కష్టించి పని చేస్తే రాత్రి హాయిగా నిద్ర పట్టినట్లుగా జీవితాన్ని సద్వినియోగం చేసుకుంటే మరణం ఆనందంగా ఉంటుంది.

– లియొనార్డో డావిన్సీ

కదంబం

'సంఘీ'భావం....5

పనివేళలపై వివాదం!

కవర్ స్టోరీ..6

ఆయుధ దాహం..
అవనికి శాపం

ఈ వారం కవిత్వం...12

కృష్ణ బిలం

ఔషధాల నిధి దానిమ్మ.. 18

కథ..20

మాయా బంధాలు

సాహిత్యం.. 23

'తల్లీ! నిన్ను దలంచి'

హాస్యానికి చిరునామా.. 28

ఇంకా...

మొగ్గ

వారఫలం

వంటలు

వగైరా.. వగైరా..

సమాచారం

రెండు నగరాలను కలిపే టన్నెల్

ప్రయాణం చేయాలంటే సాధారణంగా బస్సు, రైలు, ద్విచక్ర వాహనాలు, పడవలు మరీ దూరమైతే విమానాల్లో వెళ్లడం పరిపాటి. కానీ ఈ మార్గం వీటన్నిటికీ విభిన్నంగా ఉంటుంది. నార్వేలోని రెండు నగరాల మధ్య ప్రయాణం చేయాలంటే సొరంగం ద్వారా వెళ్లాలి. బెర్లిన్‌ను, ఓస్లో నగరాలను ఈ టన్నెల్ కలుపుతుంది. దీనిని ల్యార్డాల్ టన్నెల్ అని అంటారు. ఈ సొరంగం సుమారు పదిహేను మైళ్లు ఉంటుంది. ప్రపంచంలోనే అత్యంత పొడవైన టన్నెల్‌గా పేరు గాంచింది. ఉదయం, మధ్యాహ్నం, రాత్రీ అన్న తేడా లేకుండా ఇందులో లైట్లు వెలుగుతూనే ఉంటాయి. ఆ లైటింగే దీని ప్రత్యేకత. సో.. ఈ టన్నెల్ పర్యాటక కేంద్రంగా మారిపోయింది. రద్దీ సమయంలో కొన్ని గంటలో వందల కొలది వాహనాలు ఈ సొరంగం గుండా ప్రయాణిస్తాయట.

అక్కడ ప్రతిరోజూ సంబరాలు

సంవత్సరంలో క్రిస్మస్ ఒక్కసారే వస్తుంది. కానీ ఒకే ఒక్క చోట మాత్రం రోజూ క్రిస్మస్ సంబరాలు జరుగుతాయి. ఇంగ్లండ్‌లోని చెసింగ్టన్ నగరంలో ఒక థీమ్ పార్కు ఉంది. క్రిస్మస్ వేడుకలకు పెట్టింది పేరు ఈ పార్కు. ఈ థీమ్ పార్కులో వున్న ఒక హోటల్‌లోని కొన్ని ప్రత్యేక రూముల్లో ప్రతిరోజూ క్రిస్మస్ వేడుకలు జరుగుతాయట. ఆ గదుల్లో ప్రతి రోజూ క్రిస్మస్ పండుగ వాతావరణం ఉంటుంది. క్రిస్మస్ బ్యాండ్ సంగీతంతో అతిథులకు స్వాగతం పలకటం మరో విశేషం. వేడుకలు జరిగే గదుల్లో వున్న అతిథులకు క్రిస్మస్ వంటకాలను వడ్డిస్తారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

పిల్లలు
చాలా సార్లు ఇరుగు-పొరుగు
ఇళ్లల్లో వున్న కొత్త కొత్త వస్తువులు
తమకూ కావాలని పేచీ పెడుతుంటారు.
ప్రతిసారీ వారి మాటలకు లొంగిపోయి బోల్డంత
డబ్బు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. దానికితోడు
ఇరుకిళ్లు. వాళ్లకు కావాల్సినవి కొనిచ్చినా ఇంట్లో
స్థలం సరిపోదు. డైనోసార్‌ల ఆకారంలో వున్న ఈ
హ్యాంగింగ్ చైర్స్‌ను ఎంచక్కా బాల్కనీల్లో
అమర్చుకోవచ్చు. పిల్లలు, పెద్దలు ఎవరైనా
ఎప్పుడు కావాలంటే అప్పుడు రిలాక్స్
అవచ్చు.

'సంఘీ' భావం

పనివేళలపై వివాదం!

ఉద్యోగులు, కార్మికులకు సంబంధించి.. వారు రోజుకు ఎన్ని గంటల పాటు పని చేయాలన్న అంశం ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. మొట్టమొదటిగా ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ తమ సంస్థ ఉద్యోగులతో నిర్వహించిన ఒక సమావేశంలో మాట్లాడుతూ వారానికి కనీసం 90 గంటల పాటు పనిచేయాలని అన్నారు. అంతే కాకుండా ఆదివారం కూడా తమ విధుల్లో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. ఆదివారాలు ఇంట్లో కూర్చొని భార్యల ముఖాలు చూస్తూ గడపడం సరికాదని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనికి అనుగుణంగా ఇన్ఫోసిస్ సంస్థ ఫౌండర్ నారాయణమూర్తి కూడా పనివేళల అంశంలో సుబ్రహ్మణ్యన్‌కు అనుకూలంగా ప్రకటన చేశారు. అయితే ఆనంద్ మహీంద్ర మాత్రం వీరిద్దనీ తాను ఎంతో గౌరవిస్తానని చెబుతూనే పనివేళల సమయంలో గంటలతో పనిలేదని, వారు చేస్తున్న పనికి సంబంధించి నాణ్యమైన ఉత్పత్తి ఇస్తే సరిపోతుందని అన్నారు. అంటే వారానికి 90 గంటలు అవసరం లేదని. 48 గంటలు పని చేసినా సంతృప్తికరంగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం తాజాగా వాణిజ్య సముదాయాల్లోను, దుకాణాల్లోను పని చేసే వారు రోజుకు పది గంటలు పనిచేయడానికి వీలుగా ఉత్తర్వులను జారీ చేసింది. అయితే ఒక నిబంధన విధిస్తూ వారంలో 48 గంటల పనివేళలు మించకుండా చూసుకోవాలని స్పష్టం చేసింది. ఒకవేళ ఈ పనివేళలు 48 గంటలకు మించితే ఉద్యోగులకు అదనపు వేతనం చెల్లించాలని స్పష్టం చేసింది. ఇప్పటికే ప్రైవేటు యాజమాన్యాలు తమ ఉద్యోగులతో ఎక్కువ సమయం పని చేయిస్తున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వులు సిబ్బందికి కొంత ఇబ్బందికరంగా పరిణమించే పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి మానసిక శాస్త్రవేత్తలు, నిపుణులు చెబుతున్న ప్రకారం ఒక మనిషి ఎక్కువ గంటలు పనిచేయడం వల్ల అతను ఉత్పత్తి చేసే అంశాలు నాణ్యతను కోల్పోతాయని స్పష్టం చేస్తున్నారు. పని వేళలు విపరీతమైన అలసటను, అసంతృప్తిని కలిగిస్తే ఆ ప్రభావం అతను పనిచేసే పనితనంపై చూపిస్తుందని, దీనివల్ల మంచి కంటే చెడు ఎక్కువ జరిగే ప్రమాదం ఉందని స్పష్టం చేస్తున్నారు. అంతే కాకుండా కార్మికులు, ఉద్యోగులు అందరికీ ఒకే విధమైన పనివేళలు ఉండటం కూడా సరికాదని అన్నారు. ఉదా: శారీరక శ్రమను ఉపయోగించి పనిచేసే కార్మికులు ఎక్కువ సమయం పనిచేస్తే వారి ఆరోగ్య పరిస్థితి పైనే కాకుండా పనిచేసే సమయంలోనూ అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఒక పనిని మొదలు పెట్టిన మొదటి మూడు గంటలతో పోలిస్తే ఆ తరువాత క్రమంగా పనివేగం, నాణ్యత తగ్గుతుందని పేర్కొంటున్నారు. ప్రతి నాలుగు గంటలకు ఒకసారి విశ్రాంతి కల్పించడం ద్వారా మరింత సమర్థవంతమైన పనిని వారి నుంచి సాధించవచ్చు. అదేవిధంగా కార్యాలయాల్లో మెదడును ఉపయోగించే పనిచేసే ఉద్యోగుల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుందని చెబుతున్నారు. అందరికీ ఒకే పనిగంటలు సమానంగా ఉండకపోయినా ఆయా పనుల్లో మాత్రం అలసట ఎక్కువగా ఉంటే పనినాణ్యత తగ్గుతుందని మానసిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరోపక్క వారంలో రెండు రోజులు సెలవు ఉంటే వారు సేదతీరి తిరిగి విధుల్లో చేరే సమయంలో మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. వారంలో ఒకరోజు పూర్తిగా విధులకు దూరంగా ఉండే విధంగా సిబ్బంది, కార్మికులు సేద తీరాలని, అప్పుడే వారి నుంచి పూర్తి స్థాయిలో పనిని చేయించుకోవచ్చని స్పష్టం చేస్తున్నారు. మనిషి కుటుంబ జీవనానికి దూరం అయితే అతనిలో కొన్ని దుష్ఫలితాలు కనిపిస్తాయని, ఆ ప్రభావం పనిపై చూపించే ప్రమాదం ఉంటుందని వారు అంటున్నారు. అదే విధంగా సెలవు రోజుల్లో కొన్ని వ్యక్తిగత కార్యక్రమాలు పూర్తి చేసుకుంటారని, ఉదా: వాహనం మరమత్తు, దుస్తులను శుభ్రం చేసుకోవడం, పూర్తి స్థాయిలో విశ్రాంతి తీసుకోవడం లేదా ఆటవిడుపు కింద ఏదైనా ఆసక్తి ఉన్న ప్రదేశాలను సందర్శించడంగానీ, వినోదాల్లో పాల్గొనడం వంటి చర్యల ద్వారా తిరిగి పనికి వచ్చేసరికి ఉత్సాహంగా ఉంటారని పేర్కొంటున్నారు. యంత్రాలు సైతం నిరవధికంగా పనిచేస్తే దెబ్బతింటాయని, అదే విధంగా కార్మికులు, ఉద్యోగులు కూడా తగిన విశ్రాంతితోనే సమర్థవంతంగా పనిచేస్తారని స్పష్టం అవుతోంది. ఈ కారణాలు దృష్టిలో ఉంచుకుని గంటల పనివేళలు పక్కన పెట్టి నాణ్యత కలిగిన పనిని రాబట్టేందుకు సంస్థల యాజమాన్యాలు గాని, ప్రభుత్వాలు కాని వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

ఆయుధ దాహం.. అవనికి శాపం

సుంకవల్లి సత్తిరాజు

జానెడు పొట్టకు గుప్పెడు మెతుకులు చాలు ఆకలి తీర్చుకోవడానికి. కొద్దిపాటి ఆహారంతో సమసిపోయే క్షుద్బాధ కోట్లకొలది సంపద కోరుకుంటుందా? సామ్రాజ్యాలను కొల్లగొట్టమని చెబుతుందా? యుద్ధాలతో రక్తపాతం సృష్టించమని చెబుతుందా? అణ్వాయుధాలతో జన హననం చేయమని చెబుతుందా?

ఎంత కాలం ఈ అలజడులు? ఎందుకోసం ఈ యుద్ధాలు? ఇతర దేశాలను కబళించాలని పరాయి దేశాలు ప్రయత్నిస్తే ఆ చర్యలను ధీటుగా తిప్పికొట్టడం సముచితం. దేశ భక్తి, ఆత్మాభిమానం, సార్వభౌమత్వ పరిరక్షణ అన్ని దేశాలకు అవసరమే. కానీ తమ దేశమే గొప్పదని, తమ మాటే శాసనమని హూంకరించడం నియంతృత్వమే అవుతుంది. అమెరికా లాంటి దేశాలు అహం అనే పునాదులపై నిర్మింపబడి, అగ్రరాజ్యమనే హోదాతో ఇతర దేశాలను లొంగదీసుకోవడానికి ప్రయత్నించడం ఆక్షేపణీయం. అగ్రరాజ్యాలు తమ వద్ద ఇబ్బడి ముబ్బడిగా ఆయుధాలను సమకూర్చుకుంటూ, అణ్వాయుధాలను పెంచుకుంటూ తమ రక్షణ వ్యవస్థలను పటిష్టం చేసుకోవడానికి ప్రయత్నించడంలో లేని తప్పు ఇతర దేశాలు శత్రుదేశాల నుండి తమను తాము కాపాడుకోవడానికి తమ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడంలో తప్పులు వెదకడం భావ్యమా? ఆయుధ వ్యాపారం మొదలు పెట్టింది అగ్రరాజ్యాలు కాదా? ఒకప్పుడు ఇరాన్, ఇరాక్‌లకు ఆయుధ, ఆర్థిక సహకారం అందించిన అమెరికా తర్వాత కాలంలో అమెరికాకు ఎదురు తిరిగిన ఇరాక్‌ను నాశనం చేసి, సద్దాం హుస్సేన్‌ను హతమార్చిన సంగతి మరువలేం.

ఇజ్రాయిల్-ఇరాన్‌లు ప్రస్తుతానికి శాంతించినా, ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినా మధ్య ప్రాచ్యం మారణహోమం నుండి పూర్తిగా బయట పడలేదనే చెప్పాలి.

పూర్తి స్థాయిలో శాంతి ఒప్పందం కుదిరితేనే పరిస్థితులు కుదుట పడగలవు. ఇరాన్, ఇజ్రాయిల్‌లు సమీప భవిష్యత్తులో తిరిగి సంఘర్షణాత్మక పంథాలో పయనించబోవనే నమ్మకమైతే లేదు. ఇరు దేశాలు కాల్పుల విరమణకు ముందు పరస్పరం భీకర దాడులు చేసుకున్నాయి. ఇరాన్-ఇరాక్‌ల మధ్య కాల్పుల ఒప్పందం కుదిరినట్టు ట్రంప్ ప్రకటించడంతో పశ్చిమాసియాలో తాత్కాలిక శాంతి వాతావరణం నెలకొంది.

అమెరికా జోక్యం అవసరమా?

అసలు ఇరాన్ ఇజ్రాయిల్ గొడవల్లో అమెరికా తలదూర్చడమేమిటి? అమెరికా, నాటో దేశాల జోక్యం వలనే రష్యా, ఉక్రెయిన్లు సుమారు మూడున్నర సంవత్సరాలుగా అవిశ్రాంతంగా భీకర పోరు సాగిస్తున్నాయి. ఇరు దేశాలకు చెందిన సైనికులు, పౌరులు సుమారు పదిహేడు లక్షల మందికి పైగా మరణించినట్టు కొన్ని నివేదికలు తమ గణాంకాల ద్వారా తేటతెల్లం చేసాయి. ఇరు దేశాల మధ్య సాగుతున్న యుద్ధం ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యంలోకి నెట్టింది. అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్న ప్రపంచ దేశాలకు ఇరు దేశాల మధ్య దూరి సమస్యను జటిలం చేసింది. ఇజ్రాయిల్ పులిమీద పుట్రలా ఇరాన్ ఇరాక్ యుద్ధం దాపురించింది. మధ్యలో అమెరికా తలదూర్చడాన్ని పలు దేశాలు తప్పుబట్టాయి. తమ దేశాలను అణ్వస్త్రాలతో నింపుకున్న అమెరికా-ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ అణుశక్తి కార్యక్రమాన్ని నిలిపివేయాలని కోరుకోవడంలో ఔచిత్యం లేదు. తానొక శాంతి దూతనని స్వయంగా ప్రకటించుకున్న స్వయం ప్రకటిత మేధావి డేనాల్డ్ ట్రంప్, రష్యా-ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని నిలువరించడంలో దారుణంగా విఫలమై ఎప్పుడు ఇరాన్‌పై దాడులకు పాల్పడి, ఇజ్రాయిల్‌కు మద్దతునిచ్చి పెద్ద తప్పిదమే చేసాడు. ఒకవైపు యుద్ధాలకు పురిగొల్పుతూ నోబెల్ శాంతి బహుమతి కోసం ట్రంప్ పాకులాడడం కొంగ జపం చేయడం వంటి విన్యాసమే.

భారత్‌తో ఇతర దేశాలకు ఎందుకు విరోధం?

చైనా, బంగ్లాదేశ్, టర్కీ, అజర్ బైజాన్ వంటి దేశాలు భారత్ పట్ల ఎందుకిలా ప్రవర్తిస్తున్నాయి? భారత్ వలన మేలు పొందిన దేశాలు ఎందుకు కీడు తలపెడుతున్నాయి? పహల్గాం సంఘటన తీవ్రతను ఐక్యరాజ్య సమితి, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఎందుకు అంత తీవ్రంగా గుర్తించడం లేదు? పాక్ వలన ఏర్పడే ముప్పును నిలువరించడంలో ఎందుకంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి? ప్రపంచం దృష్టికి పాక్ కుట్రలను తీసుకురావడానికి భారత ప్రతినిధి బృందం వివిధ దేశాల్లో పర్యటించింది. అయినా పెద్దగా ప్రయోజనమేమీ కనిపించలేదు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాక్‌కు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ సాయం చేయడం తగునా? ఈ విషయాలపై లోతైన విశ్లేషణ జరగాలి.

పహల్గాంలో జరిగిన పాక్ ప్రేరిత నరమేధానికి ప్రతీకారంగా భారత్ దాయాది దేశమైన పాక్‌కు బుద్ధి చెప్పాలని తలంచి, ఆపరేషన్ సిందూర్‌కు శ్రీకారం చుట్టింది. అంతకు ముందే పాక్‌తో ద్వైపాక్షిక సంబంధాలన్నింటినీ భారత్ తెగలెంపులు చేసుకుంది.

సుదీర్ఘ కాలంగా పాక్‌తో కొనసాగుతున్న సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలుపుదల చేసింది. ఉగ్రవాదులను ఏరివేయడమే లక్ష్యంగా సాగవలసిన ఆపరేషన్ సిందూర్ పాక్ దుందుడుకు చర్యలతో యుద్ధంలా మారి, చివరికి పాక్ ప్రాధేయపడడంతో సమసిపోయింది.

భారత్ సైనికుల సాహసానికి పాక్ సైన్యం ప్రతీకార చర్యలకు దిగినా, భారత్ వ్యూహాలకు దాయాది దేశం బెంబేలెత్తి పోయింది. పాక్ ఆర్మీ, సివిలియన్స్ జోలికి పోకుండా కేవలం ఉగ్రవాద పోస్టులను నిర్వీర్యం చేయడానికి పరిమితమైన భారత్‌ను పాక్ రెచ్చగొట్టింది. ఉగ్రవాదులతో తమకు సంబంధం లేదని వాదిస్తున్న పాక్ నాయకులు, మిలటరీ పెద్దలు ఆపరేషన్ సిందూర్‌లో హతులైన ఉగ్రవాదుల అంత్యక్రియలకు హాజరు కావడం, ఉగ్రవాద చర్యలకు సంఘీభావం ప్రకటించడమే కాకుండా భారత్ జరిపిన ఆపరేషన్‌లో చనిపోయిన ఉగ్రవాదుల కుటుంబాలకు నష్టపరిహారమందించారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి మసూద్ అజహర్‌ని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన విషయా విదితమే. ఈ కరడు గట్టిన ఉగ్రవాది మసూద్ అజహర్‌కు పాక్ ప్రభుత్వం పధ్నాలుగు కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించినట్టుగా వార్తలు వెలువడ్డాయి. ఈ చర్య ద్వారా ప్రపంచం దృష్టిలో పాక్ దోషిగా నిలబడింది. ఉగ్రవాదులకు పాక్ ఇస్తున్న ప్రాధాన్యం గురించి ప్రత్యేకంగా ఇంతకంటే ప్రత్యక్ష నిదర్శనమేముంటుంది?

పాక్-టర్కీల ప్రేమాయణం

మిడిల్ ఈస్ట్ దేశమైన టర్కీతో భారత్‌కు ఎలాంటి విభేదాలు లేవు. ప్రస్తుతం తుర్కియేగా పిలవబడుతున్న టర్కీ కోవిడ్ సమయంలో మందులు లేక విలవిల్లాడుతున్న సందర్భాలలో మందులు సరఫరా చేసి ఎంతో మంది ప్రాణాలను భారత్ ఆదుకుంది. భూకంపంతో భయానక పరిస్థితులు ఏర్పడిన తుర్కియేకు భారత్ ఉదారంగా సాయం చేసింది. పాముకు పాలు పోసి పెంచితే ఏమవుతుందో ఇటీవల భారత్‌పై ఎగిరిన తుర్కియే డ్రోన్లు, పాక్ సైనికుల చేతిలో ఉన్న ఆయుధ సామాగ్రి తేటతెల్లం చేసింది. ఇంతకంటే నమ్మక ద్రోహం మరొకటుండదు.

కృతజ్ఞత మరచిన టర్కీ ఇటీవల భారత్-పాక్ మధ్య జరిగిన యుద్ధంలో పాక్‌కు భారీగా ఆయుధాలను డ్రోన్లను సరఫరా చేసింది. భారత్ పై పాక్ ప్రయోగించిన డ్రన్లన్నీ టర్కీకి సంబంధించినవి. ఆయుధాలు, డ్రోన్లను పాక్‌కు సరఫరా చేసినందుకు, పాక్‌కు మద్దతునిచ్చినందుకుగాను భారత్ టర్కీపై నిషేధం విధించింది.

సింధు జలాలు ఇక పాక్‌లో ప్రవహించునా?

సింధు జలాలను విడుదల చేయాలని పాక్ ప్రభుత్వం భారత్‌కు అనేక లేఖలు రాసినా భారత్ దీనిపై పెద్దగా ప్రతిస్పందించలేదు. పి.ఒ.కె.ను తనకు అప్పగిస్తేనే సింధు జలాలను విడుదల చేస్తామని భారత్ పేర్కొనడం విశేషం. ఇప్పటికే నీరు లేక పాక్ ప్రజల్లో అలజడి మొదలైనది. సింధు జలాల విషయంలో భారత్ రాజీ లేని వైఖరి అవలంబించడం పాక్‌కు మింగుడు పడడం లేదు.

అమెరికా ధోరణి అసమంజసం

భారత్ సమగ్రతను దెబ్బతీయాలని చైనా ఒకవైపు ప్రయత్నిస్తుంటే, మరొక అగ్రదేశం అమెరికా భారత్‌ను వాణిజ్య చట్రంలో ఇరికించాలని ప్రయత్నిస్తున్నది. ఉక్రెయిన్‌తో మినరల్ డీల్ కోసం పట్టుబట్టిన అమెరికా ఉక్రెయిన్ భద్రతను గాలికి వదిలేసింది. పాక్‌తో ట్రంప్ లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని, స్వయంగా తన కుటుంబ సభ్యులకు లాభం చేకూర్చడానికి చేసిన ప్రయత్నం కారణంగానే భారత్‌ను అమెరికా వాణిజ్య వ్యూహంలోకి నెడుతున్నది.

ప్రపంచ దేశాలతో భారత్‌కు దౌత్య వాణిజ్య సంబంధాలు మెరుగ్గానే ఉన్నాయి. అమెరికా మాత్రం మోడీ నా మిత్రుడు అంటూనే, ఐ లవ్ పాకిస్తాన్ అంటూ భారత్‌కు ఎసరు పెడుతున్నాడు. యూరోపియన్ యూనియన్‌లో 27 సభ్యత్వ దేశాలున్నాయి. వీటిలో ట్రంప్ ధోరణి నచ్చక, రెసిప్రోకల్ టారిఫ్‌లతో విసుగెత్తి చాలా దేశాలు భారత్‌తో వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకోవడానికి ఉత్సుకత చూపుతున్నాయి. ఇస్లాం దేశాలు కూడా ప్రస్తుతం పాక్‌కు మద్దతునివ్వడం లేదు. బ్రిక్స్ దేశాల్లో చైనా తప్ప మిగిలిన దేశాలతో భారత్ సఖ్యతగానే ఉంటున్నది.

కాని యూరోపియన్ పట్ల, బ్రిక్స్ దేశాల పట్ల ట్రంప్ ధోరణి వ్యతిరేకంగానే ఉంది. బ్రిక్స్ కూటమి తమకు వ్యతిరేకంగా ఏర్పడిన కూటమిగా ట్రంప్ భావన, డాలర్‌కు ప్రత్యామ్నాయంగా కరెన్సీ ఏర్పాటు చేసుకుంటే సహించేది లేదని ట్రంప్ హెచ్చరించడం సముచితం కాదు. నాటో పట్ల కూడా ఇటీవల ట్రంప్ వ్యతిరేక వైఖరి ప్రదర్శిస్తున్నారు.

కెనడా, గ్రీన్ లాండ్, పనామాల పట్ల ట్రంప్ చాలా దురుసుగా ప్రవర్తించి నగుబాటు పాలైన విషయం మరవక ముందే, భారత్ పట్ల కూడా అనుచితంగా ప్రవర్తిస్తూ అభాసుపాలవడం చూస్తున్నాం. ఇండో పసిఫిక్ రీజియన్ భద్రతకు, శాంతి సుస్థిరతలకు, అభివృద్ధి కోసం ఏర్పడిన క్వాడ్ కూటమిలో సభ్యదేశమైన అమెరికా నిర్వాకం సముచితంగా లేదు. కేవలం తన కుటుంబ కంపెనీల కోసం పాక్‌తో ఒప్పందం చేసుకుని, భారత్-పాక్‌ల మధ్య సీజ్ ఫైర్ కోసం తానేదో భారత్‌ను బెదిరించినట్టుగా బీరాలు పలకడం ట్రంప్ స్వార్థాన్ని, ఆహాన్ని సూచిస్తున్నది.

భారత్‌లో యాపిల్ కంపెనీలు పెట్టవలసిన అవసరం లేదని, అమెరికాలో పెట్టాలని ఇటీవల ట్రంప్ యాపిల్ సి.ఇ.ఓ కు చెప్పడం అభ్యంతరకరం. అమెరికా ఇలాగే ప్రవర్తిస్తే భారత్ సహించకూడదు. అమెరికా దిగుమతులపై సుంకాలు తగ్గించకూడదు. అమెరికాతో భారత్ వాణిజ్య సంబంధాలు దెబ్బతింటే, అమెరికా కూడా తీవ్రంగా నష్టపోతుంది. అమెరికా ఎగుమతులకు భారత్ ఒక కేంద్ర స్థానంగా ఉంది. అమెరికా ఎగుమతుల్లో 18 శాతం భారత్ దేశానికే. ఈ విషయాన్ని అమెరికా బాగా గుర్తుంచుకోవాలి. అలాగే అమెరికా ఉత్పత్తులకు ఇండియా జీరో టాక్స్ వేయడానికి అంగీకరించినట్టు ట్రంప్ పేర్కొనడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు ఇండియా ప్రతిస్పందించకపోవడం సబబుగా లేదు. ట్రంప్ మాటలను ఎవరూ సీరియస్‌గా తీసుకోవద్దని, అమెరికాలోని కొంతమంది మాజీ అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

పొరుగు దేశాల పోరు దాయాద్ దేశం తీరు

ఇరుగు-పొరుగు దేశాల మోసపూరిత వైఖరి వలన భారత్ ఇప్పటికి తగిన మూల్యం చెల్లించుకున్న విషయాన్ని ప్రత్యేకంగా వివరించనక్కరలేదు చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మ్యాన్మార్, మాల్దీవులు, శ్రీలంక తదితర దేశాలు భారతదేశానికి పొరుగునున్న దేశాలు. మనకు దూరంగా ఉన్న దేశాలతో ప్రమాదం లేకపోవచ్చు కాని, మన పొరుగు దేశాలు సక్రమంగా లేకపోతే ఎంత ప్రమాదకరమో భారత్‌కు పొరుగునున్న చైనా, పాక్, బంగ్లాదేశ్‌ల నిర్వాకం చూస్తే అవగతం అవుతుంది.

పాక్, చైనాలు చేసిన ద్రోహం అటుంచితే, మన పొరుగునున్న బంగ్లాదేశ్ భారత్ చేసిన సాయాన్ని మరచి మన శత్రుదేశంతో స్నేహం చేస్తున్నది. శ్రీలంక కూడా చైనాతో స్నేహం చేసి, అప్పుల పాలై ఆర్థికంగా దివాళా తీసి, ప్రస్తుతం వార్తల్లో కనిపించని దేశంగా మౌనం పాటిస్తున్నది. ఒకప్పుడు స్వాతంత్ర్యం కోసం భారత్ సహాయం కోరిన బంగ్లాదేశ్ నేడు విశ్వాస ఘాతుకానికి తలపడుతున్నది.

ఆంగ్లేయుల విభజన వాదానికి ఆకర్షితులై, ఆంగ్ల పాలకులు పెట్టిన మత పరమైన చిచ్చుకు దహిందుకుపోయి మత ప్రాతిపదికన దేశాన్ని విభజించుకుని, స్వతంత్ర పాకిస్తాన్‌గా ఏర్పడి ఈ 77 సంవత్సరాలుగా పాకిస్తాన్ సాధించిందేమిటి? పాకిస్తాన్‌లో ఎంతో మంది పాలకులు మారారు. నియంతలొచ్చారు. పాకిస్తాన్ మాత్రం అభివృద్ధి సాదించలేదు. ప్రజల అవసరాలు ఉంటేలేదు. ప్రజల అసంతృప్తిని చల్లార్చడానికి మతాన్ని వాడుకోవడం, ఉగ్రవాదులను ప్రోత్సహించి, నియంత్రణ రేఖ వద్ద కాల్పులు జరపడం, భారత్ ఆధీనంలోని కాశ్మీర్‌లోకి చొరబడి, అమాయక ప్రజలను నిర్ధాక్షిణ్యంగా చంపడం, అందుకు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్థావరంగా ఏర్పాటు చేసుకుని లక్షలాది మంది యువకులను విద్యకు, ఉపాధికి దూరం చేసి ఉగ్రవాదులుగా తయారు చేసి, భారత్‌లో నరమేధానికి పురిగొల్పడం.. ఇది గత ఏడున్నర దశాబ్దాలకు పైగా పాకిస్తాన్ సాగిస్తున్న నిర్వాకం. సీమాంతర ఉగ్రవాదానికి స్వస్తి పలకాలని భారత్ ఎన్నో సార్లు పాకిస్తాన్‌కు విజ్ఞప్తి చేసింది. పాక్ మనసు మారాలని తపించింది. ఎన్నో ఒప్పందాలు చేసుకుంది. ఐక్యరాజ్య సమితికి, అగ్రరాజ్యాలకు లెక్కలేనన్ని వినతులు చేసింది. పాక్‌కు నయానా భయానా నచ్చచెప్పింది. 1947-48 మధ్య, 1965 లోను, 1971 లోను, 1999 లోను పాక్‌తో యుద్ధానికి తలపడింది.

పాక్ భారత్ చేతిలో ఓడిపోతూనే ఉంది. అయినా పాక్ పాక్ పొగరణగలేదు. భారతీయుల రక్తంతో ఎరుపెక్కిన పాక్ ఉగ్రవాదుల హస్తాలు పాక్ పాలిట భస్మాసుర హస్తాలై పాక్ మనుగడను ప్రశ్నార్థకం చేసాయి. 1971లో పాక్ నుండి తూర్పు బెంగాల్ చీలిపోయి, బంగ్లాదేశ్ ఏర్పడింది. తాలిబాన్లతో అంటకాగి, చివరకు తాలిబాన్లకే శత్రువుగా మారింది. ఆఫ్ఘనిస్తాన్‌కు అడ్డం తిరిగింది. బలూచిస్తాన్ గురిచూసి పాక్‌ను దెబ్బకొట్టింది. సింధ్ ప్రాంతంలో ప్రజలు

పాక్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తున్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రజలు పాక్ సైనికుల పీడ వదిలించుకుని భారత్‌లో విలీనం కావాలని ఆశిస్తున్నారు. పాక్ అప్పుల ఊబిలో

కూరుకుపోయింది. చైనా పడగ నీడలో సుఖనిద్ర పోవాలని తలపిస్తున్నది. పాక్ జుట్టు చైనా చేతికి చిక్కింది. ప్రజల చేతిలో చిప్ప పెట్టి అడుక్కోమని చెబుతున్న పాక్ ఇంకా కాశ్మీర్ కోసం భారత్‌తో పోరాడడం దేనికి? పోగొట్టుకోవడానికి పాక్ వద్ద మిగిలిందేమిటి? అమాయకుల రుధిరంతో పైశాచిక ఆనందం పొందడం తప్పు. మానవ హక్కులకు విలువుండదు. పాక్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడినా, సైనికుల ఆదేశాలే పాక్ పాలకులకు శిరోధార్యాలుగా మారిపోయాయి. సైనికుల మాట పెడచెవిన పెడితే పాలకులకు ఉరిశిక్షలు, యావజ్జీవ కారాగార శిక్షలు, అవినీతి కేసులు, అరదండాలు. ఇది పాకిస్తాన్ రాజకీయ రణరంగంలో కొనసాగుతున్న ప్రహసనం. ప్రజాస్వామ్య దేశానికి, మిలటరీ కనుసన్నల్లో నడిచే దేశానికి ఎంతటి వ్యత్యాసముంటుందో ప్రత్యేకించి చెప్పనక్కరలేదు.

భారత్ ప్రకటించిన ఆపరేషన్ సిందూర్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుని సైనికులకు ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మిలటరీ అధికారులు, సైన్యం తూ.చ తప్పకుండా పాటించడం జరిగింది. భారత ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం జరపడం, అన్ని రాజకీయ పక్షాలు ప్రభుత్వానికి మద్దతునివ్వడం వంటి ప్రజాస్వామ్య వాతావరణం భారత్‌లో స్పష్టంగా అగుపించింది. పాకిస్తాన్‌లో భిన్నమైన పరిస్థితులు కనిపించాయి. మిలటరీ ఉగ్రవాదుల కనుసన్నల్లో పాక్ ప్రభుత్వం పని చేసింది. పాక్ మిలటరీలో లుకలుకలు, రాజకీయ పక్షాల్లో కలహాలు, పాక్ ప్రధాని ఏడ్పులు, భారత్‌కు హెచ్చరికలు- ఇలాంటి సన్నివేశాలతో పాక్ రాజకీయాలు అపహాస్యంగా మారాయి.

ఎన్నో ప్రగల్భాలు పలికిన పాక్, భారత్‌తో కాళ్ల బేరానికొచ్చి, దాడులు ఆపాలని భారత్ డి.జి.ఎం.ఓ ను వేడుకోవడంతో భారత్ అందుకు అంగీకరించింది. సింధు జలాలను విడుదల చేసి ఆదుకోవాలని భారత్‌కు పాక్ లేఖలు రాస్తూనే, సింధూ నదీ జలాలను ఆపితే సింధు నదిలో ప్రవహించేది నీళ్లు కాదు భారతీయుల రక్తమని కారుకూతలు కూసిన ఉగ్రమూకల విషయంలో పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్‌లు తన వైఖరిని వెల్లడించకుండా ఇలా లేఖలు రాయడం, మధ్యవర్తులతో భారత్‌ను శాంతింప చేయాలనుకోవడం పొరపాటు.

దుశ్చర్యలతో విసుగెత్తి పోయిన భారత్ పాక్‌కు తనదైన శైలిలో బుద్ధి చెప్పింది. ఇదే సందర్భంలో పొరుగునున్న చైనా కూడా భారత్ రక్షణ సామర్థ్యం చూసి విస్తుపోయింది. ఇక నుంచి భారత్ కూడా తన రక్షణ బడ్జెట్‌ను మరింత పెంచుకోక తప్పదు. దీని వలన ప్రజలపై ఎంతో కొంత ఆర్థిక భారం పడుతుంది. నాల్గవ బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన భారత్ మరింత ఆర్థికంగా బలపడడానికి యుద్ధాలు అవరోధంగా మారుతున్నాయి. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య సంధి కుదరకపోతే భారత్ కూడా ఆర్థికంగా ప్రభావితమయ్యేది. హార్ముజ్ జలసంధిని మూసివేస్తానని ఇరాన్ చేసిన ప్రకటన ప్రపంచంలోని పలు దేశాలను భయకంపితులను చేసింది. ఈ జలసంధిని మూసి వేస్తే భారత్, చైనాతో పాటు పలు దేశాలకు క్రూడ్ ఆయిల్ సరఫరా ఆగిపోయి, ఆర్థికంగా దెబ్బతినే అవకాశాలున్నాయి.

ఇరాన్ ఇజ్రాయిల్ సంక్షోభానికి తాత్కాలిక విరామం ప్రకటించబడినా, అమెరికా సారథ్యంలో జరిగే శాంతి చర్చల్లో ఏదైనా ప్రతిష్టంభన చోటు చేసుకుంటే వ్యవహారం మొదటికొచ్చి, ఇరుదేశాలు మళ్ళీ యుద్ధానికి తలపడే అవకాశాలను తోసిపుచ్చలేం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసి యుద్ధాల పట్ల ప్రజలు ఆగ్రహంగా ఉన్న మాట వాస్తవం. పెరుగుతున్న అవసరాలు, ఆర్థిక పరిస్థితులు జన జీవితాలను అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో గతంలో మాదిరిగా ప్రజలు యుద్ధాలను గుడ్డిగా సమర్థిస్తూ ఆవేశంతో ఊగిపోయే పరిస్థితులు లేవు. ఈ వాస్తవాన్ని యుద్ధోన్మాదులు గుర్తించాలి.

అనేక ప్రపంచ దేశాలతో వాణిజ్య సంబంధాలు గల భారత్‌కు ఆయా దేశాల్లో జరుగుతున్న యుద్ధాలు ఆర్థిక ప్రగతికి అవరోధంగా మారే అవకాశాలున్నాయి. యుద్ధాలు ఎవరికీ శ్రేయస్కరం కాదు. యుద్ధాల్లో విజేతలంటూ ఎవరూ ఉండరు. వివిధ దేశాల వ్యూహాలను ఎప్పటికప్పుడు కని పెడుతూనే భారత్ తన పటిష్టమైన ఆర్థిక వ్యూహాలతో దేశాన్ని బలోపేతం చేయాలి.

యుద్ధాల జోలికి పోకుండానే, పాక్ వంటి ఇరుగు పొరుగు దేశాల దుర్మార్గాన్ని అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకు రావాలి. అత్యంత చాకచక్యంగా వ్యవహరించి, ప్రపంచంలోని అన్ని దేశాలతో ఆర్థిక సంబంధాలను పటిష్టం చేసుకోవాలి. ప్రపంచంలో జరిగే యుద్ధాలను నివారించడానికి భారత్ నడుం బిగించాలి. యుద్ధాలు అభివృద్ధికి అవరోధమని యుద్ధోన్మాద దేశాలకు దాటి చెప్పాలి. ■

ప్రపంచ దేశాల మధ్య తలెత్తిన ఎన్నో సమస్యలకు దారి చూపి, ఎన్నో సంక్షోభాలను తన మధ్యవర్తిత్వంతో సమసిపోయేలా చేసిన సుదీర్ఘ చరిత్ర గల అమెరికా ఇప్పుడు ట్రంప్ హయాంలో ఇంతగా దిగజారిపోవడం బాధాకరం. జార్జి వాషింగ్టన్, జెఫర్సన్, అబ్రహాం లింకన్, కెనడీ, ఒబామా లాంటి మహామహులు ఏలిన అమెరికా ట్రంప్ ఏలుబడిలో అపఖ్యాతిపాలై చరిత్ర పుటల్లో హీనంగా మిగిలే దుర్దినాలకు దగ్గర దశలో ఉంది. పాక్ తాను భారత్‌ను ఢీకొట్టి ఓడిపోయినా గెలిచినట్టు గోబెల్స్ ప్రచారం చేస్తున్నది. పాక్ అణ్వాయుధ పాటవం ప్రపంచానికి ప్రమాదం. పాక్‌లో ఇప్పటికీ అణ్వాయుధ గిడ్డంగులుంటే, వాటిని అంతర్జాతీయ సమాజం గుర్తించి, పాక్ నుండి దూరం చేయాలి. నిర్వీర్యం చేయాలి. ఇరాన్ అణు స్థావరాలను ధ్వంసం చేసిన అమెరికా పాక్ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తించడం బాధ్యతా రాహిత్యం.

యుద్ధాల్లో అంతా పరాజితులే

యుద్ధాల్లో విజేతలంటూ ఎవరూ ఉండరు. ఇరాన్–ఇజ్రాయిల్, రష్యా–ఉక్రెయిన్, భారత్–పాక్‌ల మధ్య జరిగిన సంఘర్షణలో ఈ విషయం నిరూపితమైనది. పాక్ భారీగా నష్టపోయింది. సింధు జలాలను భారత్ నిలిపివేయడంతో పాక్‌లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికే ఆర్థికంగా దివాళా తీసిన పాక్ చైనాకు అమ్ముడు పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. భారత్ విజయం సాధించినా కొంతమంది సైనికులను, కొన్ని యుద్ధ విమానాలను కోల్పోయిన మాట వాస్తవం. యుద్ధాల వలన ఇలాంటి నష్టాలు జరగడం సహజం. పాక్

సింగిల్ పేజీ కథ

పెళ్ళాం ప్యాకెట్ మనీ

"ఆయుష్షు పెంచుకోవడం ఎలా?" అనే పుస్తకాన్ని పడీ పడీ చదువుతున్నాడు సత్రవాడ సురేష్. గడియారం గంట టంగ్ టంగ్‌మని అరు సార్లు కొట్టడంతో వేడివేడి ఫిల్టర్ కాఫీ తీసుకుని వచ్చింది జితవతి. మొగుణ్ణి చూసి "ఈ మగ మహారాజుల అదృష్టమే అదృష్టం కదా! ఆడవాళ్లకు రిటైర్మెంట్ అనేదే లేదు. బక్కెట్ తన్నేంతదాకా పరుగులే పరుగులు" అని అసూయపడింది. అయినా అసూయపడి చేసేదేమీ లేదని గ్రహించి కాఫీ కప్పు మొగుడికి ఇచ్చింది.

ఇంటి బయట ముగ్గు లేకపోవడం చూసి "పనిమనిషి సత్యరేఖ ఇంకా రాలేదా అండీ?" అని అడిగింది. పట్టుమని పది వెంట్రుకలే ఉన్న బట్టతలని తడుముకుంటూ "లేదు" అని గంభీరంగా చెప్పాడు. ముప్పై ఏళ్ళు బ్యాంకులో గుమాస్తాగిరి ఉద్యోగం వెలగబెట్టి ఆరు నెలల ముందే రిటైర్ అయ్యాడు సురేష్, పిల్లలిద్దరూ పూనాలో ఉద్యోగాలు చేస్తూ ఉన్నారు.

సమయం ఏడు గంటలయ్యింది. ఇంట్లోంచి రుసరుసలాడుతూ వచ్చి జితవతి "ఏమయ్యిందండీ ఈ సత్యరేఖకు. సమయం ఏడు గంటలైనా ఇంకా రాలేదు?" అంది. "ఏమో జితవతీ! నాకు తెలియదు" మొబైల్ చూస్తూ కూర్చున్నాడు.

మళ్ళీ గంట తర్వాత ఏడుపు ముఖంతో భర్త దగ్గరికి వచ్చి "ఏమయ్యిందోనండీ సత్యరేఖకు? ఈ మూడేళ్లలో ఒక్కరోజు కూడా సెలవు పెట్టింది లేదు" అని బాధగా చెప్పింది. పనిమనిషి గురించి భార్య అంతలా బాధపడటం చూసి ఆశ్చర్యపోయాడు సురేష్. "వేరే ఏవైనా పనులుండి కొంచెం ఆలస్యంగా వస్తుందేమో చూద్దాం" అని ధైర్యం చెప్పాడు. కాలుతున్న కొవ్వొత్తి నుంచి కరిగిపోతున్న మైనంలా బాధగా ఇంట్లోకి వెళ్ళింది.

ఇన్‌స్టాగ్రాం చూస్తూ కాలం మరిచిపోయాడు సురేష్. గడియారం చూసుకుంటే పది గంటలయ్యింది. గబగబా ఇంట్లోకి వెళ్లాడు. మంచం మీద సత్యభామలాగా పడుకుని ఉంది జితవతి. ఏడ్చి ఏడ్చి ఎరుపెక్కిన కళ్లతో మొగుణ్ణి చూస్తూ "ఉందో ఊరు వదిలేసి పోయిందోనండీ" అంది.

"మన ఇంట్లో పనిచేస్తున్నంత మాత్రాన వాళ్లతో అంత అభిమానం పెంచుకోకూడదే" అని ధైర్యం చెప్పాడు.

"ఏమోనండీ! నా మనసు మనసులో లేదు. వాళ్ళ ఇంటికి వెళ్ళి ఒసారి చూసి వద్దామండీ" అని అంది.

సురేష్ స్కూటర్ స్టార్ట్ చేశాడు. అబ్బన్న కాలనీలో ఉండే సత్యరేఖ ఇంటికి చేరారు. సున్నం కొట్టిస్తున్న ఇంటి యజమాని కనిపించాడు. "సత్యరేఖ ఇల్లు ఇదే కదా" అని అడిగింది జితవతి.

"అవునమ్మా, కానీ వాళ్లు నిన్ననే ఖాళీ చేసి వెళ్ళారు. ఎక్కడికి మారారో తెలియదు" అని బదులిచ్చాడు. "మరి ఆమె రెండు నెలల ముందు కొన్న కొత్త స్కూటర్" అని అడిగింది జితవతి.

"స్కూటర్ గురించి ఎందుకు అడుగుతోందబ్బా? అని నోరు తెరిచాడు సురేష్. "సామాన్లన్నీ బాడుగ వ్యానులో పెట్టుకున్నారు. వెనుకే స్కూటర్‌లో సర్రుమని వెళ్ళింది సత్యరేఖ" అని బదులిచ్చి వెళ్ళిపోయాడు యజమాని,

"అయ్యో భగవంతుడా.... అని అక్కడే ఉన్న పిట్టగోడ మీద కూర్చుని గుండెలు పగిలేట్లు ఏడవసాగింది.

"ఆ పనిమనిషి పోతే మనకు మరో పనిమనిషి దొరకదా జితవతీ! ఎందుకలా ఏడుస్తావు? అయినా ఆమె స్కూటర్ గురించి అడుగుతున్నావేమిటి?" అన్నాడు. "అది నేను తీసిచ్చిన స్కూటర్ అండీ" అంది. "నువ్వు ఎందుకు తీసి ఇచ్చావు?" అని ఆశ్చర్యంగా అడిగాడు సత్రవాడ సురేష్. "నేను పనిచేసే ఇల్లు ఇక్కడొకటి అక్కడొకటి ఉంది, తిరగాలంటే కష్టంగా ఉంది, స్కూటర్ తీసివ్వమని అడిగితే తీసిచ్చాను" అని పైట కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ చెప్పింది. "బండి ఖరీదు లక్ష దాకా ఉంది. నీకు అంత డబ్బు నీకెక్కడిది?" అని ప్రశ్నించాడు.

"మొన్న మీరు రిటైర్ అయినప్పుడు నా ప్యాకెట్ మనీకని రెండు లక్షలు తీసుకున్నాను కదండి. మీ బ్యాంకులో అరవై పైసల వడ్డీనే కదా! రెండు రూపాయల వడ్డీ ఇస్తానంటే ఆమెకు లక్ష రూపాయలు ఇచ్చాను. దాంతో బండి తీసుకుంది. వడ్డీ కూడా ఠంచన్‌గా ఇచ్చేది" అని చెప్పింది. ఆవేశాన్ని అణుచుకుని "కష్టపడి సంపాదించిన డబ్బు ఎక్కువ వడ్డీకి ఆశపడి అసలుకే మోసం తెచ్చుకున్నావు కదా. సరే.. జరిగిందేదో జరిగింది. ఇంటికి వెళ్దా పద" అని చెప్పి బలవంతంగా ఇంటికి తీసుకెళ్ళాడు. వారం తర్వాత శుభ్రంగా కంచెపట్టు చీర కట్టి మిగిలిన లక్ష రూపాయలను తెచ్చి మొగుడి చేతికి ఇస్తూ "తక్కువ వడ్డీ అయినా మీ బ్యాంకులోనే వేద్దామండీ జరిగిందేదో జరిగింది. అనుభవం మనకు మిగిలింది" అని చెప్పింది. సురేష్ మెచ్చుకోలుగా చూశాడు భార్య వంక.

"అనుభవం అంటే జుట్టు అంతా రాలిపోయాక దొరికే దువ్వెన లాంటిది" అని మనసులో అనుకుంటూ బ్యాంకు వైపు కదిలాడు సత్రవాడ సురేష్.

ఆర్.సి.కృష్ణస్వామి రాజు

త్రివర్ణ కాశ్మీరం

ఆకు పచ్చని ప్రకృతి అందాల
నడుమ పర్వతశ్రేణులతో,
గలగలమని పారే సెలయేర్లతో
కనులకింపైన కమనీయ
కాశ్మీరం.

తెలతెల్లని చలచల్లని మంచు
అందాల గుప్పిట్లో
పర్యాటకులను
బంధించే హిమగిరి సొగసుల
సోయగాల నెలవు కాశ్మీరం.

– బి. పాండురంగ

ఆమె.. అతడు.. ఓ చీకటి

అతడు ఆ చీకట్లోకి
రెప్పెయ్యకుండా చూస్తున్నాడు
గోడకు జారబడి
చూరు నుంచి జారబడే పిల్లగాలులతో
తడిసి ముడుచుకుపోతూ
చీకట్లోకి రాళ్ల విసురుతున్నాడు.
వాడి పెదాల మధ్యన
వెలుగుతూ ఆరిపోతున్న పల్చటి నవ్వు
పచ్చి పురుగులు
కొన్ని
వాడి చుట్టూ
గింగిరాలు
కొడుతున్నాయి
పురుగు నలిగిపోయిన వాసన
అక్కడి పరిసరాల్లోకి సుతారంగా
పాకుతుంది.
అతడి ఎదురుగా
మోకాళ్లపై చుబుకం ఆన్చి
అతన్నే చూస్తున్న ఆమె
వెలుగులు ఒలికించి చేసిన రబ్బరు
బొమ్మలా ఉందామె
మైకాన్ని తాగినట్టు మెరుస్తున్న పెదాలు
స్నానమాడి వచ్చిన లేత చివురులాంటి
వేళ్ళు
ఆమె మదిలోపల నిర్విరామంగా
తచ్చాడుతున్న జ్ఞాపకాలు..
బయటెక్కడో చిటుక్కున రాలిన
చినుకు చప్పుడు..
ఉలికిపడి చూసిందామె
అతడెళ్లిపోతున్నాడు..
వేళ్ళతో పిచ్చి లెక్కలు వేసుకుంటూ
చీకటిని తడుముకుంటూ
అతడెళ్లిపోయాడు.
ఓ దుఃఖపు నవ్వును పెదాల కింద
అదిమిపెడుతూ
ఆమె చూపు తిప్పుకుంది
బరువైన నిట్టూర్పు వదులుతూ
ఒంటరితనం తోడుగా
ఊహల్ని కనుపాపలకు అంటించి
ఆమె మళ్లీ నిద్రకు ఉపక్రమించింది.

– సునీత గంగవరపు

మనసు పరిమళించెనే..

గూటిలో దేగలా
గగన విహారం చేయాలని ఉంది.
బావిలో కప్పలా నాలోని
ప్రపంచానికి ఎల్లలు కట్టలేను.
అంతులేని సంద్రాల అంచులు
తాకాలని ఉంది.
అప్పుడే విరిసిన మందారంలా
కొత్తదనాన్ని ప్రభవించే ప్రతి
ప్రభాతంలోని సరికొత్తదనాలను
సంతరించుకోవాలని ఉంది.
మనిషికి అస్తిత్వం ఎలాగో
మనసుకు వ్యక్తిత్వం అలానే కదా!
మనసు వికసిస్తే మాట పరిమళిస్తుంది.
ఇప్పుడు ఎదిగిన నా మనసులో ఒదిగిన
ఆకాశాన్ని చూస్తున్నాను.
పరిమళం అద్దడానికి
ఒదిగిన నా ఒడిలో భూగోళానికి
కాస్తంత చోటు ఇవ్వాలని ఉంది.

– కె.రవీంద్రబాబు

ఈ వారం కవిత్వం

కృష్ణ బిలం

నీ చూపు వికిరణాలు
ఎన్నో వేల సార్లు
నా హృదయ మిర్రర్‌పై
పడి పరావర్తనం చెందినా
పట్టుకోలేకపోయాను నేను.
కాలం దృక్ భ్రమ వల్ల
నా నుండి నేను
ఏనాడో వక్రీభవనం చెంది
నువ్వయిపోయాను.

నా జ్ఞాపకాలు ప్రిజంగుండా
ప్రయాణించిన
నీ ధ్వని తరంగాలు
విక్షేపణం చెంది
నా జీవిత గగనానికి
అనుభూతుల సప్త స్వరాల
ఇంద్రధనుస్సును ఏర్పర్చాయి.
అద్భుతాల సప్త వర్ణాల
సంగీతాన్ని సృష్టించాయి.
నువ్వు నా మది తెరపై
మిథ్యా ప్రతిబింబమై కనిపిస్తుంటే
నేను నిజ ప్రతిబింబమై
ఎదుట నిలిచాను.

నీ గురుత్వాకర్షణ ప్రభావం వల్ల
నా కవిత్వం కరెంట్ అయ్యింది.
నీ చిరునవ్వుల అయస్కాంత
క్షేత్రంవల్ల
నా గుండె అనునాదం చెందింది.

ఇప్పుడర్థమైంది నాకు నీ చుట్టూ
కొన్ని లక్షల భ్రమణాల తర్వాత
నీ ప్రేమే ఓ కృష్ణ బిలం.
నువ్వే నా భౌతిక శాస్త్రం.

– ఫిజిక్స్ అరుణ్ కుమార్

పొప్పడికాయ కూర

కావలసిన పదార్థాలు

పచ్చి పొప్పడికాయ ముక్కలు-ఒక పెద్ద కప్పు; ఆవాలు-ఒక చెంచా; సోంపు-చెంచా; అల్లం తరుగు-చెంచా; ఉప్పు-తగినంత; కారం-చెంచా; పసుపు-పావు చెంచా; బెల్లంపొడి-చెంచా; వేయించిన పల్లీల పొడి-పావు కప్పు; నూనె-పావు కప్పు.

తయారు చేసే విధానం

పొప్పడి ముక్కలను కుక్కర్‌లో వేసి, సరిపడినన్ని నీళ్లు పోసి ఒక విజిల్ వచ్చేంత వరకు ఉడికించి సిద్ధంగా పెట్టుకోవాలి. స్టవ్ మీద కడాయిని పెట్టి, నూనె వేసి ఆవాలు, సోంపు వేయించుకుని, అల్లం తరుగు వేయాలి. అందులో ఉడికించిన పొప్పడి ముక్కలు వేసి తగినంత ఉప్పు, కారం, పసుపు, పల్లీల పొడి వేసి అన్నింటినీ బాగా కలిపి వేగించుకుంటే రుచికరమైన పచ్చి పొప్పడికాయ కూర తయారవుతుంది.

అరటికాయ పొడికూర

కావలసిన పదార్థాలు

అరటికాయలు-రెండు, నిమ్మరసం-ఒక స్పూను; కొత్తిమీర తరుగు-టేబుల్ స్పూను; ఉప్పు-తగినంత; ధనియాలు-రెండు స్పూన్లు; ఆవాలు-ఒక స్పూను; జీలకర్ర-అర స్పూను; మెంతులు-కొద్దిగా; ఎండు మిరపకాయలు-నాలుగు; వేయించిన సోంపు పొడి-కొద్దిగా.

తయారు చేసే విధానం

స్టవ్ మీద కడాయి పెట్టి ధనియాలు, అర చెంచా ఆవాలు, జీలకర్ర, మెంతులు, ఎండు మిరపకాయలు, సోంపు వేయించుకుని ఆ తరువాత పొడి చేసుకోవాలి. అరటికాయలను చెక్కు తీసి చిన్న చిన్న ముక్కలుగా పసుపు నీళ్లల్లో అయిదు నిమిషాలు ఉడికించి పెట్టుకోవాలి. స్టవ్ మీద కడాయి పెట్టి నూనె వేసి మిగిలిన ఆవాలు, కరివేపాకు వేయించుకోవాలి. ఆవాలు చిటపటలాడాక అరటికాయ ముక్కలు, తగినంత ఉప్పు, సిద్ధంగా పెట్టుకున్న పొడి వేసి బాగా వేయించాలి. కూర దింపే ముందు కొత్తిమీర తరుగు, నిమ్మరసం వేస్తే మరింత రుచిగా ఉంటుంది.

కంద-బచ్చలి కూర

కావలసిన పదార్థాలు

కందముక్కలు-పెద్ద కప్పు; బచ్చలికూర తరుగు-పెద్ద కప్పు; నూనె-పావు కప్పు; ఎండుమిరపకాయలు-ఐదు; సెనగపప్పు-టేబుల్ స్పూను; మినప్పప్పు-టేబుల్ స్పూను; జీలకర్ర-ఒక చెంచా; ఆవాలు-రెండు చెంచాలు; పచ్చి మిరపకాయలు-రెండు; కరివేపాకు-రెండు రెబ్బలు; ఉప్పు -తగినంత; పసుపు-కొద్దిగా; ఇంగువ-కొద్దిగా; రెండు స్పూన్ల చింతపండు రసం.

తయారు చేసే విధానం

ముందుగా కంద ముక్కలను కుక్కర్‌లో వేసి సరిపడినన్ని నీళ్లు పోసి రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించి రెడీగా పెట్టుకోవాలి. ఒక స్పూను ఆవాలు, రెండు ఎండుమిరపకాయలు కలిపి పొడి చేసుకోవాలి.

స్టవ్ మీద కడాయిని పెట్టి అందులో నూనె వేసి మిగిలిన ఎండు మిరపకాయలు, సెనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, మిగిలిన ఆవాలు, ఇంగువ వేసి వేయించాలి. తరువాత పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు, పసుపు వేయాలి. ఒక నిమిషం తరువాత బచ్చలికూర తరుగు వేసి కాసేపు ఉడికిన తరువాత ఉడికించిన కందముక్కలు, తగినంత ఉప్పు, చింతపండు రసం వేసి కలపాలి. కూర ముద్దలా దగ్గరికి అవుతున్నప్పుడు స్టవ్‌ని ఆఫ్ చేసి తయారు చేసి పెట్టుకున్న ఆవపొడి వేసి మరొక్కసారి కలిపితే రుచికరమైన కంద-బచ్చలి కూర సిద్ధం.

విందు-పసందు

జిఎస్‌టి కలిపి..

టీచర్: "లీలా! ఇంగ్లీష్ ఆల్ఫాబెట్స్‌లో అక్షరాలు ఎన్ని ఉంటాయి?"

లీల: "జి.ఎస్.టి.తో కలిసి 26; లేకుంటే 23 టీచర్".

రెండు ఒకట్లు

టీచర్: "రమేష్! ఒకటికి ఒకటి కలిపితే ఎంతవుతుంది?"

రమేష్: "రెండు ఒకట్లు టీచర్"

– వి.మీరా, హైదరాబాద్

సంతోషంగా ఉందని!

ఇద్దరు వ్యక్తులు మద్యం ప్రియులు మద్యం తాగుతూ మాట్లాడుకుంటున్నారు.

మొదటి వ్యక్తి: ఎంత బాధలో ఉన్నా కూడా మద్యం తాగనని మాట ఇచ్చావు కదా! ఎందుకు ఇప్పుడు తాగావు?

రెండో వ్యక్తి: బాధలో ఉన్నప్పుడు తాగనని చెప్పాను. కానీ ఇప్పుడు సంతోషంగా ఉందని తాగాను..!

– ఎస్.కె.యాకూబ్ పాషా, ఖమ్మం

బ్రేకింగ్ న్యూస్

నగరంలోని ఒక ప్రఖ్యాత హాస్పిటల్‌లోని ఒక షేరింగ్ రూంలో టీవీ సీరియల్ గురించి పెద్ద గొడవ జరిగింది.

ఒక బెడ్‌పై పేషెంట్ ఒక చానల్‌లో సీరియల్ కోసం పట్టు బట్టేరు. కానీ పక్క బెడ్ పేషెంట్ ససేమిరా అనడంతో గొడవ మొదలయ్యింది.

చివరకు ఆ ఇద్దరు పేషంట్స్ కుటుంబాలవారు కొట్టుకునే వరకు వెళ్లింది. హాస్పిటల్ వారిపై కూడా చేయి చేసుకున్నట్టు సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

– లహరి, కరీంనగర్

వీపు రుద్దుకోవడానికి..

రామయ్య: "ఇంటిగోడలన్నిటికీ మంచిగా సున్నం వేయించి ఈ గోడకి మాత్రం వేయించలేదు. ఎందుకని?"

సోమయ్య: "వీపుకు దురద పెట్టినప్పుడు వీపును గోడకేసి రుద్దుకోవడానికి".

బండ్లు

రాజయ్య: "ఏం చేస్తున్నావు రంగయ్యా?"

రంగయ్య: "ఓడల మీద వ్యాపారం చేస్తున్నాను".

రాజయ్య: "అయితే బండ్లు కొని రెడీగా పెట్టుకోండి".

రంగయ్య: "ఎందుకు?"

రాజయ్య: "ఓడలు బండ్లు; బండ్లు ఓడలు అవుతాయంటారుగా! అందుకని"

ఆచి తూచి..

"ఆచి.. తూచి.. అని మననం చేసుకుంటూ నడుస్తున్నావెందుకు?" అడిగాడు శ్యామ్, రాముని.

"మా నాన్నగారు ఆచి తూచి నడవమన్నారు శ్యామ్, అందుకని నేను ఆచి తూచి నడుస్తున్నాను" సమాధానమిచ్చాడు రామ్.



వచ్చినవాడిని..

కళావతి: "ఏ వ్రతం చేస్తే మంచి మొగుడొస్తాడు పంతులుగారూ" అడిగింది.

పంతులు: "వచ్చిన వాడినే మంచివాడిగా చేసుకోవాలమ్మా!"

హాస్య కవిత

నా భార్య పేరు లత
పెళ్లితో మారిపోయింది
నా తలరాత
పెట్టాం కొత్త కాపురం వెరైటీగా
దాటనివ్వదు తను
గీసిన గీత
ఫేస్‌బుక్ వాట్సాప్‌లతో
కొడుతుంది బాతాఖానీ
ఉదయం చెత్త బ్రేక్‌ఫాస్ట్
చేసే డ్యూటీ
రాత్రి పొద్దు వండే డ్యూటీ
నా మీదే పెట్టింది ఎంచక్కా
చెప్పినట్టు వినకుంటే
రుచి చూపిస్తుంది కరాటే దెబ్బ.

నమ్మవద్దు

గృహిణి: ఈ లోకంలో ఎవరినీ నమ్మకూడదండీ! అంది భర్తతో.

భర్త: ఏమైంది?

గృహిణి: పనిమనిషి రెండు పళ్లాలు ఎత్తుకెళ్లింది. దాంతోపాటు ఈ చీటీ పెట్టింది.

భర్త: ఆత్రుతగా ఆ చీటీలో ఏముంది?

గృహిణి: ఆ రెండు ఫలానా రెస్టారెంట్‌లోనివే అని రాసి వుందండీ!

ఉల్లిపాయ పకోడి

సుబ్బారావు: "అప్పారావ్! నీ కుడి బుగ్గ బాగా వాచిపోయి కనిపిస్తోంది ఏమైంది?"

అప్పారావు: "మా ఆవిడను ఒక చిన్న కోరిక కోరాను"

సుబ్బారావు: "ఏమిటా కోరిక?"

అప్పారావు: "ఉల్లిపాయ పకోడి చేసి పెట్టమన్నాను".

– వైదా ఈశ్వరరావు, విశాఖ

అంతరిక్షంలో వ్యోమగాముల దినచర్య

ప్రత్యేక పరికరాలు, సాంకేతికత కారణాలతో ప్రమాదకరమైన ప్రదేశం అయినప్పటికీ వ్యోమగాములు/ఆస్ట్రోనాట్స్ అంతరిక్షంలో సురక్షితంగా జీవిస్తారు. ఇటీవల ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)లోకి చేరిన తొలి భారతీయ వ్యోమగామిగా, అంతరిక్షంలోకి వెళ్లిన రెండవ వ్యోమగామిగా శుభాంష్ శుక్లా రికార్డు సాధించడం చూసాం. సరైన పరికరాలు లేకుండా అంతరిక్షంలోకి అడుగు పెడితే 15 క్షణాలు కూడా బతకలేం. ఐఎస్ఎస్ అంతరిక్షంలో భూమిపై ఉన్న వాతావరణ పరిస్థితులను పునఃసృష్టించాల్సి ఉంటుంది. తొలిసారి అంతరిక్షంలోకి ప్రవేశించిన వారికి కొన్ని వారాలు తరుచుగా అనారోగ్యంగా ఉంటుంది. భూమికి 400 కి.మీ. దూరంలో ఉన్న అంతరిక్ష కేంద్రంలో గురుత్వాకర్షణ శక్తి ఉండదు కాబట్టి బరువును కోల్పోయి తేలియాడుతూ ఉంటారు. వీరి రోజు వారి దినచర్య చాలా విభిన్నంగా ఉంటుంది.

వ్యాయామం తప్పనిసరి

వ్యోమగాములు తినే ఆహారం, పడుకునే మంచం, స్నానం చేసే విధానం, వ్యాయామం పద్ధతులు లాంటివి అన్నీ విలక్షణంగా ఉంటాయి. ఐఎస్ఎస్‌లో నివాస పని ప్రదేశంలో సాధారణంగా ఆరు పడక గదులు, రెండు బాత్ రూమ్‌లు, ఒక జిమ్, 360 డిగ్రీలు చూడగల కిటికీలు ఉంటాయి. ప్రతిరోజూ రెండు గంటలు ట్రెడ్‌మిల్/స్టేషనరీ సైకిల్‌ని ఉపయోగించి వ్యాయామం చేస్తారు. శూన్య గురుత్వాకర్షణ శక్తి ఉండడం, నెలల తరబడి అంతరిక్షంలో తేలియాడడంతో ఎముకలు, కండరాల క్షీణత ఏర్పడి భూమికి తిరిగి వచ్చిన వెంటనే నడవలేరు, నిలబడలేరు.

రోజుకు 16 సూర్యోదయాలు

2000 నవంబర్ నుంచి 15 ప్రపంచ దేశాలకు చెందిన 5 అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు అంతరిక్ష కేంద్రం భూమి చుట్టు 16 సార్లు తిరుగుతూ, 24 గంటల్లో 16 సూర్యోదయాలు, 16 సూర్యాస్తమాల ద్వారా కక్ష్యలో తిరుగుతుంటుంది. అమెరికాకు చెందిన వ్యోమగామి పెగ్గీ విట్సన్ అత్యధికంగా 665 రోజుల పాటు అంతరిక్ష కేంద్రంలో నివసించి రికార్డును స్వంతం చేసుకుంది. అంతరిక్ష కేంద్రంలో పటిష్ట విద్యుత్తు వ్యవస్థ ఉంటుంది. వీళ్లు నిద్రపోతున్నపుడు తేలియాడకుండా ఉండడానికి గోడలకు అనుసంధానించబడిన స్లీపింగ్ బ్యాగుల్లో నిద్రిస్తారు. ప్రతి 90 నిమిషాలకు ఒకసారి సూర్యోదయం/ సూర్యాస్తమయం కావడంతో వెలుతురు రాకుండా కళ్లకు ముసుగులను ధరించి కిటికీలను మూసివేసి పడుకుంటారు. అంతరిక్ష రేడియేషన్, కాస్మిక్ కిరణాల నుంచి రక్షణ పొందడానికి స్పేస్ సూట్‌లను ధరించే వ్యోమగాములు అసాధారణ ఉష్ణోగ్రతల నడుమ కూడా సురక్షితంగా పని చేస్తారు. వ్యోమగాములకు ఐఎస్ఎస్‌లో పీల్చడానికి ఆక్సిజన్ నిరంతర సరఫరా ఉంటుంది. వ్యోమగాములకు 9 నెలల వరకు ప్లాస్టిక్ బ్యాగ్‌లలో నిల్వ ఉండే భోజనం, చిరుతిళ్ల ప్యాకెట్లు ఉంటాయి. బియ్యం, నూడుల్స్, గ్రీన్ టీ, కాఫీ, తృణధాన్యాలు, రొయ్యలు/మాంసాహారం బిస్కెట్లు, డ్రైఫ్రూట్స్ మసాలా దినుసులు, సాస్‌లు కూడా ఉంటాయి. పొడి ఆహారానికి వేడి లేదా చల్లని నీటిని కలుపుకొని తినడం జరుగుతుంది. ఐఎస్ఎస్‌లో వ్యోమగాముల చెమట, మూత్రం కూడా రీసైకిల్ చేయబడి, తిరిగి వాడడం జరుగుతుంది. వ్యోమగాముల మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రేడియోలు, వీడియో కాల్స్ ద్వారా వారి కుటుంబ సభ్యులు/సహోద్యోగులతో మాట్లాడడం, పుస్తకాలు చదవడం, సంగీతం వినడం లాంటివి చేస్తారు. ఇంటర్నెట్ సదుపాయం ఉండడంతో లైవ్ టివీలు సైతం చూడవచ్చు. టూత్ పేస్ట్, షాంపులు, బట్టలు ఉతకడం లాంటి పనులకు ప్రత్యేక వసతులు/ పదార్థాలు ఉంటాయి. అంతరిక్షం నుంచి భూమికి చేరే సందర్భాల్లో అంతరిక్ష నౌక వేగం తగ్గించడానికి పారాచూట్లు, ఇతర వ్యవస్థలను ఉపయోగిస్తారు. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోవడానికి వేడి నిరోధక పలకలు అమర్చబడి ఉంటాయి.

శాస్త్ర సాంకేతిక పరిశోధనలు

వ్యోమగాములు రోజంతా బిజీగా ఉంటారు. శాస్త్ర సాంకేతిక పరిశోధనలు చేయడం, పరికరాలను శుభ్రం చేసుకోవడం, తనిఖీలు చేయడం, అవసర మరమత్తులు చేయడం, విరిగిన పరికరాలను భర్తీ చేయడం లేదా అతికించడం జరుగుతుంది. ఐఎస్ఎస్‌లో రెండు మరుగుదొడ్లు లేదా టాయిలెట్స్ ఉంటాయి.

అత్యంత ప్రమాదకరమైన యాత్ర చేసి ఐఎస్ఎస్‌కు చేరుకొన్న వ్యోమగాముల శ్రేయస్సుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. తమకు నిర్దేశించిన జీవన శైలిని పాటిస్తూ, శాస్త్ర సాంకేతిక పరిశోధనలు పూర్తి చేసుకొని తిరిగి సురక్షితంగా నేలకు చేరుకుంటారు. ప్రాణాలను సహితం తెగించి సాహస యాత్రకు ధైర్యం చేస్తున్న వ్యోమగాములకు శుభాకాంక్షలు తెలుపుదాం, సురక్షిత తిరుగు ప్రయాణం జరగాలని ఆశిద్దాం.

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

కథ

నిజాయితీ విలువ

ఒక రాజ్యంలో విక్రమసేనుడు అనే రాజు ఉండేవాడు. ఆయన చాలా దయగలవాడు, నిజాయతీపరుడు. ప్రజలను కన్నబిడ్డల్లా పరిపాలించేవాడు.

ఆయనకు ఎప్పుడూ ఒక సందేహం ఉండేది. తన రాజ్యంలో ప్రజలందరూ తనలాగే నిజాయితీగా ఉంటున్నారా, లేదా అని తెలుసుకోవాలని అనుకునేవాడు. అందుకోసం మారువేషంలో రాజ్యంలో సంచరిస్తుండేవాడు.

ఒకరోజు రాజు అలా మారు వేషంలో తిరుగుతుండగా ఒక పేద రైతు తన పొలంలో పని చేయడం చూసాడు. ఆ రైతు చాలా దీనంగా, ఆకలితో ఉన్నట్లు కనిపించాడు. రాజు అతని దగ్గరకు వెళ్లి "అయ్యా, మీరు చాలా నీరసంగా కనిపిస్తున్నారు. మీకు ఆకలిగా ఉందా?" అని అడిగాడు.

మారు వేషంలో వున్న రైతు రాజును గుర్తుపట్టలేదు. "అవునయ్యా, చాలా ఆకలిగా ఉంది. కానీ, నా దగ్గర తినడానికి ఏమీ లేదు. నేను పండించిన పంటలో కొంత భాగం అమ్మి, ఆహారం కొనుక్కోవాలి" అని బదులిచ్చాడు.

"నేను కొన్ని బంగారు నాణేలు ఇస్తాను. అవి తీసుకుని మీ ఆకలి తీర్చుకోండి. అలాగే అధిక పంట దిగుబడికి కావలసినవి కూడా కొనుక్కోండి" అని చెప్పి పది బంగారు నాణేలు ఇచ్చాడు.

రైతు అది చూసి చాలా ఆశ్చర్యపోయాడు. "అయ్యా, మీరు ఎవరో నాకు తెలియదు. కానీ, మీరు నాకు సహాయం చేయడానికి ముందుకు వచ్చినందుకు జీవితాంతం రుణపడి ఉంటాను. కానీ ఉచితంగా వచ్చే వాటిని నేను ఆశించను" అని కృతజ్ఞతలు తెలిపాడు.

రాజు చిరునవ్వుతో "మీ పంట పండిన తరువాత నాకు తెలియజేస్తే నేను కొనుగోలు చేస్తాను. అందుకోసం ముందుగా ఈ నాణేలు తీసుకోండి" అన్నాడు.

ఆ మాటలకు రైతు కాసేపు ఆలోచించి "అయ్యా! మీరు చెప్పింది బాగానే ఉంది కానీ తమరి చిరునామా నాకు తెలియదుగా?" అన్నాడు.

"రాజు గారి కోట వద్దకు వచ్చి రాజయ్య అని అడిగితే ఎవరైనా చెప్తారు" అంటూ ఐదు నాణేలు ఇచ్చి అక్కడ నుండి రాజు వెళ్ళిపోయాడు.

రెండు నెలల తరువాత రైతు పంటను కోసి ధాన్యం బస్తాలు తీసుకుని కోట వద్దకు వచ్చి రాజయ్య గురించి అడగసాగాడు. కోట బురుజు నుండి చూసిన రాజు అన్న మాట ప్రకారం ధాన్యం తెచ్చిన రైతు నిజాయితీకి ఆశ్చర్యపోయాడు. రాజు ఆ రైతును సభకు పిలిపించి అతడి నిజాయితీని సభలోని వారందరికీ వివరించాడు. తరువాత ఆ రైతుకి బహుమానంగా అతడు తెచ్చిన ధాన్యంతో పాటు కొంత ధనం ఇచ్చి పంపించాడు.

– సుమ కైకాల

వార్త ఆదివారం



బాలగేయం

అమ్మ మాట వింటాం
అన్ని పనులు చేస్తాం
అయ్య చెయ్యి పట్టుకొని
అన్ని ఊళ్ల తిరుగుతాం
బడికి బాగా వెళ్తాం
ఆటలెన్నో ఆడుతాం
పాటలెన్నో పాడుతాం
మొక్కలను నాటుతాం
మొక్కలను రక్షిస్తాం
మంచి కథలు చదువుతాం
మంచిని పాటిస్తాం
చెయ్యి చెయ్యి కలుపుతాం
చెలిమితో వెలుగుతాం
నీతి నీడన ఎదుగుతాం
నిజాయితీగా బతుకుతాం.

– చాలా మునిశేఖర్ రెడ్డి

పిల్లలం.. మేం పిల్లలం

పిల్లలం.. మేం పిల్లలం
బులి బులి అడుగులు వేస్తాం
గోడను ఆసరా చేసి నడుస్తాం
చూసినవన్నీ కావాలంటాం
తెచ్చేవరకు అలుకలు పోతాం
అమ్మని చేరి మారాం చేస్తాం
ఇంటిని పీకి పందిరి వేస్తాం
పాలసీసాను చేత పడతాం
గడగడ తాగేస్తాం
కాసేపటికి అమ్మ ఒడిలో
హాయిగా నిద్ర పోతాం.

– వి.ఈశ్వరరావు

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్
గిరీష్ అంకుల్ సమాధానాలు

ఎన్.వసుమతి, నల్గొండ

ప్రశ్న: నీటి లోపల కూడా సిమెంట్‌ని ఉపయోగించి బ్రిడ్జిలను ఎలా నిర్మిస్తారు?

జవాబు: మన దేశంలో నీటిలోపల జరిగే నిర్మాణాలు విషయమై కొన్ని ప్రత్యేక పద్ధతులను అవలంభిస్తున్నారు. నదిబ్రిడ్జి నిర్మించవలసిన చోట నీటి ప్రవాహం లేకుండా ఇసుకతో నింపిన బస్తాలతో అడ్డుకట్ట వేసుకొని నిర్మిస్తున్నారు. నీటి ప్రవాహం బాగా ఎక్కువగా ఉండే ప్రాంతంలో అయితే బ్రిడ్జి స్తంభాలు నిర్మించే చోట వెల్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసుకొని నీటిని తోడివేస్తారు. ఆ తరువాత కాంక్రీట్‌తో స్తంభాలను నిర్మిస్తారు. ఇతర దేశాలలో అయితే నీటి లోపల బ్రిడ్జిలను నిర్మించే సందర్భంలో ఒక ప్రత్యేకమైన సిమెంట్ వాడతారు. సాధారణ సిమెంట్ కంటే, తక్కువ వ్యవధిలోనే ఈ సిమెంట్‌తో తయారైన కాంక్రీట్ దృఢతరంగా గట్టిపడుతుంది.

సి.కార్తిక్, అమరావతి

ప్రశ్న: పారాచూట్ తెరచి వుంచిన గొడుగు ఆకారంలో ఉంటుంది.. ఎందువల్ల?

జవాబు: పారాచూట్ గొడుగు ఆకారంలోనే ఉండటం వల్ల పరిసరప్రాంతాలలోని గాలి పారాచూట్ లోపలికి ప్రవేశించదు. అంతేకాదు, గురుత్వాకర్షణ శక్తిప్రభావం పారాచూట్‌ను కిందకు (భూమివైపుగా) నెడుతుంది. అందువల్ల పారాచూట్ ప్రయాణించే వేగం నెమ్మదిగా క్షీణిస్తూ, భూమి మీదకు చేరుతుంది.

చూడగానే ఎర్రగా నోరూరించే పండు దానిమ్మ. ఈ పండుని తినడానికి చాలా మంది ఇష్టపడతారు. పెరుగన్నం, సలాడ్స్, జ్యూస్ వరకూ వీటిని ఎన్నో రకాలుగా తీసుకోవచ్చు. వీటిని తీసుకోవడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి.

ఉదయాన్నే మనం దానిమ్మ గింజల్ని తీసుకుంటే అవి డయాబెటిస్, ఆస్తమా వంటి ఎన్నో సమస్యలు దూరమవ్వడమే కాకుండా, ఎముకలకి కూడా మంచిదని న్యూట్రిషనిస్టులు చెబుతున్నారు. దానిమ్మను పండుగా తినవచ్చు, రసంలా తీసుకోవచ్చు. దానిమ్మ తొక్కలు కూడా వివిధ ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. వాటిని పొడిగా చేసి నీటిలో కలిపి తీసుకోవచ్చు.

దానిమ్మ చాలా రుచికరంగా, తియ్యగా ఉంటుంది. దానిమ్మపండు అత్యంత ఆరోగ్యకరమైన, పోషకమైన

ఔషధాల నిధి దానిమ్మ

పండ్లలో ఒకటి. దానిమ్మలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది, రోగనిరోధక శక్తిని పెంచుతుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది. దానిమ్మలో ఉండే యాంటీ

ఆక్సిడెంట్లు రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. ధమనులలో ఫలకం ఏర్పడకుండా నిరోధించడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. దానిమ్మలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది.

ఎన్ని జాగ్రత్తలు తీసుకుని పోషకాహారం తిన్నా కూడా బాడీలో సమస్యలు పెరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు సాధారణమయ్యాయి. దీనికి కొలెస్ట్రాల్ కారణం. చెడు కొలెస్ట్రాల్ పెరగడానికి కూడా మన లైఫ్‌స్టైల్ దగ్గర్నుంచీ తినే ఆహారం, తాగే డ్రింక్స్ వరకూ ఎన్నో కారణాలుగా మారాయి. వీటి వల్ల చాలా వరకూ బాడీలో కొలెస్ట్రాల్ పెరిగి ఇతర ఆరోగ్య సమస్యలొస్తున్నాయి. వీటన్నింటికీ చెక్ పెట్టి ఆరోగ్యంగా జీవించాలంటే మనం కొన్ని ఫుడ్స్ తీసుకోవాలి. ముఖ్యంగా కొలెస్ట్రాల్‌ని కరిగించాలంటే ఓ ఫ్రూట్ హెల్ప్ చేస్తుందని చెబుతున్నారు. కొలెస్ట్రాల్ కరిగి ఆరోగ్యంగా ఉండేందుకు సరైన ఆహారం తీసుకోవాలి.

ఎప్పటికప్పుడు డైట్‌లో మార్పులు చేయాలి. ముఖ్యంగా పోషకాహారం తీసుకోవాలని చెబుతున్నారు వైద్య నిపుణులు. దానిమ్మ తినడం వల్ల కొలెస్ట్రాల్‌ని చాలా వరకూ తగ్గించొచ్చని అంటున్నారు. ఇప్పటికే కొలెస్ట్రాల్ సమస్య ఉంటే దానిమ్మని తింటే సిరల నుండి పూర్తిగా కొలెస్ట్రాల్‌ని కరిగించొచ్చు. దానిమ్మలో పాలీఫెనాల్స్, ఎలాజిక్ యాసిడ్ వంటి యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి బాడీలోని చెడు కొలెస్ట్రాల్ అంటే LDL ఆక్సీకరణని నిరోధిస్తాయి. వాస్తవానికి, LDL ఆక్సీకరణం చెంది క్రమంగా ధమనుల్లో పేరుకుపోయి ఫేక్ రూపంగా మారతాయి. దీంతో ధమనులు మూసుకుపోతాయి. ఈ కారణంగానే గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యలొస్తాయి.

దానిమ్మ పండు తినడం వల్ల సిరలు శుభ్రంగా మారతాయి. ఇందులోని పోషకాలని మనం తీసుకున్నప్పుడు విటమిన్స్ అన్నీ శరీరానికి అందుతాయి. ఇందులోని నేచురల్ స్వీట్‌నెస్ మనకి అప్పటికప్పుడు ఎనర్జీని అందిస్తుంది. నీరసంగా ఉన్నప్పుడు వీటిని తింటే తక్షణమే శక్తి అందుతుంది. దానిమ్మ గింజల్లో ఎక్కువగా ఫైబర్ సమస్యల్ని దూరం చేసి కడుపు నిండుగా ఉండేలా చేస్తుంది. ఈ కారణంగా పండు తిన్న తర్వాత అజీర్ణం, మలబద్ధకం, బ్లోటింగ్, గ్యాస్ వంటి సమస్యలు రావు. రెగ్యులర్‌గా తింటే మంచిది. ఉదయం దానిమ్మ గింజల్ని తినండి. జ్యూస్‌లో ఎక్కువగా షుగర్ ఉంటుంది. వీటి వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయి. కేలరీలు 234, ప్రోటీన్ 4.7 గ్రా., కొవ్వు 3.3 గ్రా., కార్బోహైడ్రేట్స్ 52 గ్రా., ఫైబర్ 11.3 గ్రా. వీటితో పాటు విటమిన్ సి, ఫొలేట్, మెగ్నీషియం, పొటాషియంలు ఉన్నాయి. ఇవన్నీ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ఒక మీడియం సైజు దానిమ్మ పండులో 3 గ్రాముల ప్రోటీన్, 7 గ్రాముల ఫైబర్, 30 శాతం విటమిన్ C, 16 శాతం ఫోలేట్, 12 శాతం పొటాషియం ఉంటాయని అంచనా. ఒక కప్పు దానిమ్మ గింజలు తింటే శరీరానికి 24 గ్రాముల షుగర్, 144 క్యాలరీల శక్తి అందుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు అల్జీమర్స్ వ్యాధికి చెక్ పెట్టి జ్ఞాపకశక్తిని మెరుగు పరుస్తాయి.

మెదడు చురుగ్గా పనిచేసేలా చేస్తాయి. వీటిలో తక్కువ కేలరీలు, కొవ్వు ఎక్కువగా ఉంటాయి. ఇందులో పీచు, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా ఉంటాయి. దానిమ్మ పండ్లని ఎక్కువగా తీసుకుంటే ఈ పోషకాలన్నీ అందుతాయి.

ఈ పండులో కేన్సర్‌ని నిరోధించే లక్షణాలు ఉన్నాయి. దానిమ్మ రసం తీసుకుంటే ప్రొస్టేట్ కేన్సర్ తగ్గుతుందని చెబుతున్నారు నిపుణులు. ఈ పండు తింటే గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్, కేన్సర్ వంటి దీర్ఘకాలిక శారీరక సమస్యల్ని దూరం చేస్తాయి.

బహుళ ప్రయోజనాలు

దానిమ్మలో దీర్ఘకాలిక సమస్యలు దూరమవుతాయి. ఈ పండు తింటే బాడీలో మంట తగ్గుతుంది. దానిమ్మలో పాలీఫెనోలిక్ గుణాలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

దానిమ్మ పండు మూత్రపిండాల పనితీరుని మెరుగ్గా చేస్తుంది. కిడ్నీల్లో రాళ్ళ సమస్యని తగ్గిస్తుంది. కిడ్నీలో రాళ్ల సమస్యని దూరం చేయడంలో ఈ పండు చాలా బాగా పనిచేస్తుంది. దానిమ్మ రసం రక్తంలో ఆక్సలేట్స్, కాల్షియం సాంద్రతని తగ్గిస్తుంది. ఇవి ఎక్కువగా ఉంటే కిడ్నీల్లో రాళ్లు ఏర్పడతాయి.

దానిమ్మ రసం తాగితే కీళ్ల నొప్పులు, వాపు తగ్గుతాయి. కండరాలు బలోపేతం అవుతాయి. దీంతో కీళ్ల నొప్పులు, వాపు నుంచి ఉపశమనం లభిస్తుంది. దానిమ్మలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మంపై ముడతలను తగ్గించి స్కిన్ మెరిసేలా చేస్తాయి.

ఇందులో ఉండే విటమిన్స్ చర్మాన్ని సాఫ్ట్‌గా ఉంచే కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు మొటిమల కారణంగా వచ్చే వాపును తగ్గిస్తాయి. దానిమ్మలో ఎల్లాజిటానిన్స్ అనే యాక్సిడెంట్స్ శరీరంలోని వాపుని తగ్గిస్తాయి. ఇవి బ్రెయిన్ హెల్త్‌కి చాలా మంచిది. దీంతో అల్జీమర్స్, పార్కిన్సన్స్ సమస్యలు దూరం అవుతాయి.

దానిమ్మ పండుని అలానే తినడం చాలా మంచిది. అప్పుడే అందులోని ఫైబర్ అందుతుంది. జ్యూస్ తాగాలనుకుంటే అందులో పంచదార వేయకుండా తాగాలి. సాధారణంగా, చర్మ సంబంధిత సమస్యలు ఉంటే దానిమ్మ తినకండి. దీనివల్ల సమస్య మరింత

తీవ్రమయ్యే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు.

దానిమ్మపండు తినడం వల్ల చర్మంపై మచ్చలు, అలర్జీలు వంటి సమస్యలు పెరుగుతాయి. కాబట్టి, ఈ పండును అతిగా తినకండి. వైద్యుల సలహా మేరకు తినడం మంచిది.

తక్కువ రక్తపోటు ఉన్నవారు కూడా దానిమ్మపండ్లు తినకూడదు. దీనివల్ల శరీరంలో రక్త ప్రసరణ మందగిస్తుంది. అదనంగా, తక్కువ రక్తపోటుకు మందులు తీసుకునే వారికి దానిమ్మ హానికరం అని నిపుణులు అంటున్నారు. అధిక రక్తపోటు ఉన్నవారు దానిమ్మపండ్లు తింటే రక్తపోటు పెరిగే అవకాశం ఉంది. మూత్రపిండాల సంబంధిత సమస్యలు ఉన్నవారు దానిమ్మపండ్లు తింటే వారి సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు దానిమ్మపండు తింటే హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. అలాగే, ఖాళీ కడుపుతో దానిమ్మ పండు తినవద్దు. ఎందుకంటే దీనివల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి.

మధుమేహం ఉన్న వ్యక్తులకు దానిమ్మపండ్లు ప్రయోజనకరంగా ఉంటాయి. వాటిలో యాంటీ ఆక్సిడెంట్లు, ముఖ్యంగా పాలీఫెనాల్స్ పుష్కలంగా ఉంటాయి, ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

అయినప్పటికీ, సహజ చక్కెరలను కలిగి ఉన్నందున దానిమ్మపండ్లను మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. దానిమ్మలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది, ఇది ఆరోగ్యకరమైన రక్త కణాలను నిర్వహించడానికి, రక్తహీనతను నివారించడానికి అవసరం. దానిమ్మ పండ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మెరుగైన ఆరోగ్యానికి దోహదపడుతుంది.

- ఆనంద 'మైత్రేయ'మ్

కథ

మాయా బంధాలు

డాక్టర్ సన్నిహిత్

మానవ సంబంధాల్లోని పెళుసుదనం అంత తొందరగా కనపడదు. ఒక ప్రత్యేక దృష్టితో తరచి తరచి చూడాలి. శోధించాలి.. అప్పుడే మనకు ఆ డొల్లతనం గోచరం అవుతుంది. ఇది అర్థం కావాలంటే నాకు జరిగిన అనుభవాల్ని మీకు చెప్పాలి!"కంగ్రాచ్యులేషన్స్ అమ్మా.." నోట్లో స్వీట్ పెడుతూ సంతోషపడిపోసాగారు నాన్న.

"థాంక్యూ నాన్నా!" అంటూ గర్వంగా ఫీల్ అయ్యాను. నాకు ఎంసెట్‌లో మంచి ర్యాంక్ వచ్చిందని తెలియగానే అందరూ అభినందించడం కొత్తగా అనిపించింది. గెలుపు ఇచ్చే కిక్ తెలుస్తోంది. ఒక మూల నుండి నా వైపు గుర్రుగా చూస్తున్నాడు నా అన్నయ్య. వాడు అప్పటికే ఇంజినీరింగ్‌లో జాయిన్ అయి చదవలేక డిస్ కంటిన్యూ చేసి తిరిగి వచ్చేసాడు. మా అమ్మ అయితే "ఆడపిల్లకు అంత పెద్ద చదువులు ఎందుకండీ?" అని మా నాన్నకు ఎప్పుడూ బ్రేకులు వేస్తూ ఉండేది. అయినా నాన్న ఎవరి మాటా వినకుండా నన్ను బాగా చదువుకోమని ప్రోత్సహించారు. ఆయన కాళ్లకు దండం పెట్టి దీవెనలు తీసుకున్నాను.

రెండో రోజు ఇంట్లో పెద్ద యుద్ధమే అయింది నా అన్నయ్య వల్ల. "దాన్ని ఇంజినీరింగ్ చదివిస్తే నేను ఇంట్లో నుండి వెళ్ళిపోతాను" అని గొడవ పెట్టసాగాడు. మా అమ్మ "పెళ్ళి చేసుకుని ఇంకో ఇంటికి వెళ్ళిపోయేదానికి అంత చదువు ఎందుకు? ఏదో ఒక డిగ్రీ చేయిస్తే సరిపోతుంది కదా!" అని వాడికి వంత పాడింది.

నాన్న ఆలోచనల్లోకి వెళ్లిపోయారు. రెండు రోజులు దాకా సరిగ్గా భోజనం కూడా చెయ్యలేదు ఆయన. తర్వాత తన నిర్ణయాన్ని దృఢంగా చెప్పారు "ఎవరు ఒప్పుకున్నా కాదన్నా అమ్మాయిని ఇంజినీరింగ్‌లో జాయిన్ చేస్తాను"అని.

మా అమ్మ, అన్నయ్య నాన్న మీద తిరగబడ్డారు. అయినా నాన్న వెనక్కు తగ్గలేదు. ఆ విధంగా ఇంజినీరింగ్‌లో జాయిన్ అయ్యాను. నేను ఒక కొత్త ప్రపంచంలోకి ప్రవేశించాను. ఇంజినీరింగ్ చదువేమీ నాకు నల్లేరు మీద నడకలా సాగలేదు. అడుగడుగునా ఏదో ఒక ఆటంకాన్ని సృష్టించేవాడు మా అన్నయ్య.

నాన్న సపోర్ట్‌తో అవన్నీ దాటేసాను. చివరికి క్యాంపస్ ఇంటర్వ్యూలో మంచి జాబ్ వచ్చింది. ఆకర్షణీయమైన ప్యాకేజీ! ఆ రోజు నాన్న ఆనందానికి అవధులు లేవు. అందరికీ గొప్పగా చెప్పుకోవడం మొదలెట్టారు.

అయితే ఆయన ఆనందాన్ని ఎక్కువసేపు ఉంచడం ఇష్టం లేదన్నట్లు ఇంట్లో నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడు అన్నయ్య. ఇక నా తల్లిదండ్రులు వాడి ఆచూకీ తెలుసుకునే పనిలో పడిపోయారు. నా గురించి పట్టించుకునే ధ్యాస లేదు. ఒక్కదాన్నే వెళ్ళి సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాయిన్ అయ్యాను.

ఆ రోజు ఇంటికొచ్చాక నా ఆనందాన్ని పంచుకోవడానికి కూడా ఆస్కారం లేదు. ఎందుకంటే అన్నయ్యను తీసుకుని వచ్చారు అమ్మా నాన్న. ఇంట్లో గంభీర వాతావరణం. అందరూ ముభావంగా ఉన్నారు. నేను కూడా నిశ్శబ్దంగా ఉండిపోయాను.

కాలక్రమంలో నేను నా జాబ్ రీత్యా బిజీ అయిపోయాను. అన్నయ్య ఏ పనీ చెయ్యకుండా ఇంట్లో కూర్చుని ఎంజాయ్ చెయ్యడంలో బిజీ అయిపోయాడు. వాడిని ఏమైనా అంటే ఇంట్లో నుండి మళ్లీ పారిపోతాడేమో అన్న భయం నా తల్లిదండ్రులకి ఎలాగూ ఉంది. దాన్ని ఎడ్వాంటేజ్‌గా తీసుకుని ఏ పనీ చెయ్యకుండా ఒక ప్యారసైట్‌లా ఎదుటి వాళ్లని ఎలా ఎక్స్‌ప్లాయిట్ చెయ్యాలా? అన్న అంశం మీద పరిశోధన చెయ్యసాగాడు.

నాకు పెళ్ళి సంబంధాలు రాసాగాయి. సంపాదించే అమ్మాయిని కాబట్టి తొందరగానే పెళ్లి సెట్ అయింది. అంగరంగ వైభోగంగా కాకపోయినా బాగానే జరిగింది నా పెళ్లి. నా భర్తది గవర్నమెంట్ జాబ్. మేముంటున్నది హైదరాబాద్‌లోనే. మా ఆయన చాలా సాత్వికుడు. మా పేరెంట్స్ ఇంటికి దగ్గర్లోనే ఇంకో ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం పెట్టాం. ఇద్దరం పాలూ, నీళ్లలా కలిసిపోయాం. మా అన్యోన్యత ఫలితంగా తొందరగానే గర్భవతిని అయ్యాను, మాకు పండంటి బాబు పుట్టాడు.

అప్పుడే మొదలైంది అసలు గొడవ. మా ప్యారసైట్ మళ్లీ యాక్టివ్ అయ్యాడు. "నా కంటే చిన్నదానికి పెళ్ళి అయింది, పిల్లాడు కూడా పుట్టాడు. నాకు మాత్రం పెళ్ళి చెయ్యరు. నా బతుకు ఇలా తగల బడిపోవాలా?" అని అమ్మా నాన్న మీద అరవడం మొదలెట్టాడు.

వాడికి పిల్లనివ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు. చివరికి ఎలాగో ఒక సంబంధం కుదిరింది. అన్నయ్య పెళ్లి ఘనంగా జరిగింది. ఈ పెళ్లి అనేది నాకు మనశ్శాంతి లేకుండా చేస్తుందనీ, నాకు-నాన్నకీ మధ్య దూరం పెంచుతుందని అసలు ఊహించలేకపోయాను.

....

ఒకరోజు మా వదిన అన్నయ్యను పిలిచి నా ముందే చెబుతోంది "నిన్ను పెళ్ళి చేసుకున్నది నీ చెల్లెలిని, వాళ్ల పిల్లాడిని చూసుకోవడానికా? నిన్ను చూసుకోవడమే ఎక్కువ. ఇంకా ఈ పనికిమాలిన మేళం కూడానా?" అని.

నా గుండె మండిపోయింది ఆ మాటలు విని. చిత్రంగా నా తల్లిదండ్రులు కానీ మా అన్నయ్య కానీ ఆమెకు ఎదురు చెప్పలేదు. ఆమె మాటలు వింటూ మౌనంగా ఉండిపోయారు. అప్పుడే నాకు తెలిసొచ్చింది ఆ ఇంట్లో మాకూ మా పిల్లాడికి ఉన్న స్థానం ఏమిటో! అయినా మాకేం తక్కువ? ఇద్దరం సంపాదిస్తున్నాం. అందుకే ఒక బేబీ కేర్ సెంటర్‌లో మా అబ్బాయిని ఉంచడం ప్రారంభించాం. ఆ రోజు నుండి మా అమ్మా వాళ్ళ ఇంటికి వెళ్ళడం దాదాపు తగ్గించేసాను. నా భర్త, నా పిల్లాడు, నా ఆఫీసు.. ఇదే నా ప్రపంచం.. అనుకుంటూ బతకసాగాను

చాలా రోజుల తరువాత ఒకరోజు సాయంత్రం అమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళాను. నేను వెళ్ళేటప్పటికి అమ్మ మంచం మీద మూలుగుతూ కనిపించింది. నాన్న కనబడలేదు. వదిన ఎక్కడుందో తెలీదు.

కన్నీళ్లు వచ్చాయి నాకు. "ఎలా ఉన్నావమ్మా? ఏమైంది?" అని అడిగాను.

"బాగా బీపీ పెరుగుతోందమ్మా. ఎందుకో బ్లడ్ మోషన్స్ కూడా అవుతున్నాయి" అని చెప్పింది అమ్మ.

"నాన్న, అన్నయ్య ఎక్కడికి వెళ్ళారు?" అడిగాను.

"ఏమో!" అన్నట్లు చేతులతో సైగలు చేసింది. కాసేపటికి నాన్న, వదిన ఇంటి వెనక నుండి నవ్వుకుంటూ వచ్చారు. అన్నయ్య ఊరి మీద షికారుకి వెళ్లంటాడు. ఇక అక్కడ ఉండలేక ఇంటికి వచ్చేసాను.

"నాకెందుకు ఇదంతా?" అనుకున్నాను. కానీ అదే నేను చేసిన తప్పు. ఒక రాత్రి మంచి నిద్రలో ఉండగా ఫోన్ రింగ్ అయింది. లిఫ్ట్ చెస్తే అటు నుండి నాన్న "మీ అమ్మ చనిపోయిందమ్మా" అని చెప్పి పెట్టేసాడు.

గుండె ఆగినంత పనయింది నాకు. మా ఆయన్ని లేపి వెంటనే వెళ్ళాం. అమ్మ శవాన్ని చూడగానే ఏడుపు కంట్రోల్ చేసుకోలేకపోయాను. అలా ఏడుస్తూనే ఉన్నాను. నా భర్త నన్ను ఓదారుస్తూ "రాత్రి స్ట్రోక్ వచ్చిందట. నిద్రలోనే పోయారు" అని చెప్పాడు. ఆ తర్వాత నేను స్పృహ కోల్పోయాను. మళ్లీ కళ్లు తెరిచేటప్పటికి హాస్పిటల్‌లో ఉన్నాను. పక్కనే నా భర్త, పిల్లాడు మా ఆయన నా చేతిని గట్టిగా పట్టుకుని. అన్ని కార్యక్రమాలు జరుగుతున్నాయి. నువ్వు టెన్షన్ పడకు" అన్నారు. నెమ్మదిగా ఏడ్వసాగాను. కోలుకున్నాక ఇంటికి వచ్చేసాం. నేను ఎంతో ప్రేమించిన నా తల్లి దూరం కావడం మానసికంగా పెద్ద దెబ్బ నాకు.

"ఎలా ఉన్నావమ్మా? ఏమైంది?" అని అడిగాను. "బాగా బీపీ పెరుగుతోందమ్మా. ఎందుకో బ్లడ్ మోషన్స్ కూడా అవుతున్నాయి" అని చెప్పింది అమ్మ.

ఒకసారి చెక్ బుక్ అయిపోవడంతో బ్యాంక్‌కి వెళిల అప్లై చేసాను. కొన్ని రోజుల తర్వాత అది మా పుట్టింట్లో డెలివర్ చేసానని పోస్ట్ మేన్ చెప్పాడు. అది తీసుకుందామని ఒక సాయంత్రం అక్కడికి వెళ్ళాను.

నాన్నతో "నా చెక్ బుక్ కోసం వచ్చాను నాన్నా. పోస్ట్ మేన్ ఇక్కడే ఇచ్చాడంట, అదివ్వండి" అన్నాను.

మా వదిన "ఇక్కడ ఏ చెక్ బుక్కూ లేదు. అందరికి సేవలు అందించడమేనా మా పని" అంటూ విసుక్కుంటోంది. నాన్న నా వైపు చూస్తూ "ఇక వెళ్లు" అని అరిచాడు.

ఒళ్ళు మండింది నాకు. "నువ్వు నా తండ్రిని కాదా? ఈ ఇంటికి వచ్చే హక్కు కూడా లేదా నాకు" అని గట్టిగా అన్నాను. అంతవరకూ నిశ్శబ్దంగా వింటున్న అన్నయ్య కూడా "ఏంటి? హక్కుల గురించి మాట్లాడుతున్నావు. నిన్ను చదివించాం. పెళ్ళి చేసి పంపించాం. ఇంకా నీకు, నీ మొగుడికి, నీ పిల్లలకి జీవితాంతం అన్నీ చెయ్యాలా?" అంటూ ఎదురు తిరిగాడు.

బాగా షాక్ అయ్యాను నేను. నేను నా తండ్రి, అన్నయ్యలలో వచ్చిన మార్పు నాకు స్పష్టంగా తెలుస్తోంది. గుండె బద్దలవుతున్నట్లు అనిపించింది. మా వదిన వంకరగా విజయదరహాసంతో నవ్వడం నా దృష్టి నుండి దాటిపోలేదు. తల కొట్టేసినట్టయింది. పెళ్లికి ముందు వరకు స్వేచ్ఛగా తిరిగిన నా పుట్టింట్లోనే నాకు విలువ లేదు. ఒక స్థానం లేదు. నా అన్నయ్య నన్ను రావద్దంటే సరే నా తండ్రికి ఏమయింది? ఎందుకిలా అడ్డంగా మాట్లాడుతున్నాడు. ఎవరైనా కన్నకూతురిని వదులుకుంటారా? అంత తప్పు నేను ఏం చేసాను? వాళ్ళని అంత ఇబ్బంది నేను ఏం పెట్టాను? అన్నీ సమాధానం లేని ప్రశ్నలే! కానీ ఒకటి మాత్రం నిజం.. నా రాక వాళ్ళకి చాలా కంటకంగా ఉంది. అది ఆర్థిక పరమైనది కావచ్చు. బహుశా నేను భవిష్యత్తులో ఆస్తి కోసం వస్తానేమోనన్న భయం కావచ్చు. లేదా ఇంకా ఏదో కావచ్చు. అది ఏమిటన్నది నాకు అర్థ కాలేదు. అర్థం అయినా కాకున్నా ఇక నేను ఆ ఇంట్లో అడుగుపెట్టడం మాత్రం జరగదు.. అని నిర్ణయించుకుని ఏడుస్తూ అక్కడి నుండి వచ్చేసాను. ఆ రాత్రి నా భర్త ఒళ్లో తలపెట్టుకుని ఏడ్చి భారమంతా దించుకున్నాను. వాళ్లతో మాకు అనవసరం అని ఆ క్షణమే నిర్ణయించుకున్నాం మేం.

కాలం గడుస్తోంది. సంవత్సరం తిరిగిపోయింది. నాన్నకు ఆరోగ్యం బాగా లేదనీ హాస్పిటల్‌లో ఉన్నాడని తెలిసింది. వెళ్దామనుకున్నాను.. కానీ ఎందుకొచ్చావు? అన్న ప్రశ్న ఎదురవుతుందని మానేసాను. ఆయనకు సర్జరీ అయిందని జీర్ణాశయం తొలగించారనీ, లిక్విడ్ డయిట్ మీదే బతుకుతున్నారని తెలిసింది. చాలా బాధపడ్డాను. కాలక్రమేణా ఆయన అంత్య దశకు చేరుకున్నారని, ఇక ఎక్కువ రోజులు బతకరని అందువల్ల తెలిసి ఆయనను పుట్టి పెరిగిన ఊరు తీసుకుపోయారని తెలిసింది.

చివరకు ఆయన మరణ వార్త తెలిసి ఉరుకులు పరుగులతో ఆ ఊరికి వెళ్ళాను. కన్నీరు మున్నీరుగా విలపించాను.

ఏడుస్తూ.. ఏడుస్తూ సొమ్మసిల్లిపోయాను. ఎప్పటికో మెలకువ వచ్చింది నాకు. అంతిమ సంస్కారాలు అయిపోయాయని చెప్పాడు నా భర్త. ఇక ఆ ఊళ్లో ఉండలేక వెంటనే హైదరాబాద్ వచ్చేసాం. వారం రోజుల దాకా మామూలు మనిషిని కాలేకపోయాను. నా భర్త ఓదార్పుతో ఆ బాధలో నుండి కొంచెం బయట పడ్డాను. వాస్తవ జీవితంలోకి వచ్చాను. అవీ ఇప్పటిదాకా నా జీవితంలో జరిగిన సంఘటనలు.

....

ఒక ఆదివారం.. మధ్యాహ్నం... ఇంటి పనులు చేసుకుంటున్నాను. నా భర్త నిద్రపోతున్నాడు. అబ్బాయి సెల్ ఫోన్‌లో ఏదో గేమ్ ఆడుకుంటున్నాడు. అనూహ్యంగా మా నాన్న గారింట్లో ఎప్పటి నుండో చేస్తున్న పనిమనిషి సీత వచ్చింది.

"రా సీతా! చాలా కాలమయింది నిన్ను చూసి" అంటూ లోపలికి పిలిచాను.

వస్తూనే నెమ్మదిగా ఏడ్వసాగింది. "నాన్న చనిపోయారు కదమ్మా! ఊరికి వెళ్ళి వచ్చావా?" అని అడిగింది.

"వెళ్ళాను సీతా, ఆయనకు నేను అక్కర్లేకపోయినా నేను వదులుకోలేను కదా" అన్నాను.

"అయ్యో! అంత మాట అనకండమ్మా. ఎంత మంచి మనిషమ్మా మీ నాన్న. నిన్ను ఎంత బాగా చూసుకొనేవారు. కోడలు మహాతల్లి వచ్చాక మారిపోయారు" నిష్టూరంగా అంది.

ఆమె చెప్పేది నా వదిన గురించి అని అర్థమయింది. "ఎవరో చెబితే మారిపోవడానికి ఆయనేమీ చిన్న పిల్లాడు కాదు కదా సీతా" అన్నాను.

"అయ్యో! నీకు ఎలా చెప్పాలమ్మా?" అంటూ ఈ చెక్ బుక్కు నీదేనంట, మీ వదిన ఇది లేదని చెప్పిందట కదా. ఈ మధ్యనే మీ నాన్న గారికి ఇంట్లో దొరికిందట. నీకు ఇమ్మని చాటుగా చేతికి ఇచ్చారు. నేనే మర్చిపోయానమ్మా ఈలోగా ఆయన ఈ లోకం నుండే వెళ్ళిపోయారు" అని ఏడ్వసాగింది. ఆ కవర్ని నా చేతిలోకి తీసుకున్నాను.

"సరే సీతా, జరిగిందేదో జరిగిపోయింది. ఇక ఆ ఇంటితో నాకు బంధం తెగిపోయింది.. నా బతుకు నాది" అని రెండు వందల నోటు దాని చేతిలో పెట్టాను.

"సరే వెళ్ళొస్తానమ్మా!" అని సీత వెళ్ళిపోయింది.

బెడ్ రూములోకి వచ్చి చెక్ బుక్ ఉన్న కవర్ ఓపెన్ చేసాను. లోపల చెక్ బుక్‌తో పాటు ఒక లెటర్ కూడా ఉంది. అది మా నాన్న రాసినది. ఆశ్చర్యంతో నా గుండె కొట్టుకునే వేగం హెచ్చింది. లెటర్ చదవడం మొదలెట్టాను.

"అమ్మా..!

అల్లారు ముద్దుగా పెంచిన నిన్ను పెళ్ళి చేసి పంపించాక నా బాధ్యత తీరిపోయిందనుకున్నాను. నీ జీవితం నీవు ఆనందంగా గడుపుతుంటే చూసి ఎంతో సంతోషించాను. కానీ నేనే పూర్తిగా పతనం అయిపోయానమ్మా. పెళ్లి చేసుకుని మరో ఇంటికి వెళ్ళిపోయిన మీ అమ్మాయి కష్ట సుఖాలతో ఇంకా మీకు ఏమిటి సంబంధం? ఇక చాలు... మీ లైఫ్ మీరు ఎంజాయ్ చెయ్యండి" అని నా కోడలు చెప్పిన మాటలు నమ్మాను. ఆమె భ్రమలో పడి నిన్ను దూరం పెట్టేసాను. అనారోగ్యం దరిచేరడంతో మీ అమ్మ కృశించిపోయింది సరైన వైద్యం కూడా ఇప్పించలేదు నేను.

ఈ విషయాలేవీ నీ వరకు రాలేదు. గుండెల్లో బాధని ఎవరికీ చెప్పుకోలేని దిగులుతోనే మీ అమ్మ చనిపోయింది. కానీ నా తప్పులన్నీ గమనిస్తున్న భగవంతుడు సరైన శిక్ష విధించాడు. నేను భ్రమించిన తియ్యటి బంధాలతోనే నా మరణ శాసనాన్ని లిఖించాడు. నేను అందరినీ దూరం చేసుకుని ఐసోలేటెడ్‌గా ఉండాలి అనేది కొడుకూ కోడలు వేసిన పథకం అని అర్థం అయింది. అప్పటికే పరిస్థితి చేయి జారిపోయింది. తమకు కావాల్సినవన్నీ సాధించుకున్న వాళ్లిద్దరు నేను దిన దినం క్షీణిస్తుండటంతో నన్ను పట్టించుకోవడం మానేసారు. అనారోగ్యం నన్ను కబళించసాగింది. త్వరలో నేను చనిపోతాను. భౌతికంగా నేను దూరం అయినా కానీ నీ మనసులో నుండి మాత్రం నన్ను తుడిచివేయకమ్మా ఇదే నా చివరి కోరిక!

నన్ను క్షమిస్తావని ఆశిస్తూ... నాన్న"

....

ఉత్తరం చదివాక మౌనంగా అయిపోయాను. నాన్న చివర్లో రియలైజ్ అయ్యారు. కానీ మేమందరం కూడా అలాగే ప్రవర్తించాం కదా! మా ఆనందాల్ని చూసుకున్నాం కదా. అయితే అసలు ఈ మొత్తం కథలో ఎవరిది తప్పు? అని ఆలోచించసాగాను. నా తప్పా లేక మా నాన్న తప్పా? మా అన్నా వదినల తప్పా? పరిస్థితులదే తప్పా? చిన్నప్పటి నుండీ నన్ను ఎంతగానో ప్రేమించి పెద్ద చేసి భార్యా కొడుకు కన్నా నన్ను బాగా చదివించిన నాన్న సడన్‌గా ఎందుకు మారిపోయాడు? అంటే నాకు పెళ్ళి చేసి పంపించేసి తన బాధ్యత తీర్చుకున్నాక. కొత్త బంధాలు ఏర్పడ్డాక నాపై ఉన్న ప్రేమ మొత్తం ఆవిరి అయిపోయిందా? ఒక్కసారిగా ప్రేమ తగ్గిపోతుందా? చిన్నప్పటి నుండీ ఇన్నేళ్ళుగా పేర్చుకున్న బంధం టప్‌మని కట్ అయిపోతుందా? మా మధ్య ఉన్న బంధానికి కొత్త రూపు వచ్చేస్తుందా? అన్నీ ప్రశ్నలే! సమాధానం లేని ప్రశ్నలు!! మనుషులంతా మానవ సంబంధాల నుండి ఆనందాన్ని వెతుక్కుంటారు. అలా ఆనందం వస్తున్నంతసేపూ ఆ బంధానికి విలువ ఇస్తారు. ఒకసారి ఆ బంధంలో ఆనందం లేదు అని తెలిస్తే నిర్దాక్షిణ్యంగా ఆ బంధాన్ని తెంచుకుంటారు. ఆనందాన్ని ఇచ్చే ఇంకో బంధాన్ని వెతుక్కుంటారు. అయితే ఇదంతా కాలం సృష్టిస్తున్న తాత్కాలిక మాయ. నిజమైన బంధాలు అంటూ ఏమీ ఉండవు.

అందుకేగా మనిషి తను పుట్టిన తర్వాత ఏర్పరుచుకున్న బంధాలని, వయసు పెరిగి వృద్ధాప్యం ముంచుకొచ్చి మరణానికి చేరువ అయినప్పుడు.. అంటే చివరికి మరణిస్తూ అన్నీ వదిలించుకుని పోతారు.

కాకపోతే ఆ బంధాలకి తన జీవన యానంలో ప్రేమపాశం అనుబంధం అంటూ గొప్ప పేర్లు పెట్టుకుని ఆనందిస్తారు. అందుకే ఇవన్నీ కాలం పేర్చిన బంధాలు. మళ్ళీ ఆ కాలమే కర్కశంగా కూల్చేసే తాత్కాలిక అనుబంధాలు".

‘తల్లీ! నిన్ను దలంచి’

ప్రస్తుత 21వ శతాబ్దంలో ‘నెట్’ మనకు గురుకులం. ఇంటర్నెట్ మాత్రమే గురువు. దాని అన్వేషి విద్యార్థి. అంతర్జాలంలో మనకు లభించినది, చూసేదే జ్ఞానం. ఇప్పుడు ‘వాట్సాప్’ వంటి వాటిలో ఇంగ్లీసు కీ బోర్డుతో తెలుగు రాయడం అలవాటైంది. తెలుగు కీ బోర్డు లేదా అంటే ఉంది. సుమారు 56 అక్షరాలను 26 అక్షరాలలో కుదించి రాస్తే తప్పులు తప్పటం లేదు. ఉన్నత విద్యార్హతలు ఉన్నవారిలోనూ దోషాలు దొర్లుతూ ఉన్నాయి. భాషకు ప్రాథమికాంశమైన ‘స్పెల్లింగ్’ క్రమేపీ తప్పుల తడక అవుతోంది. తెలుగు గుణింతాలు నేర్పే అలవాటు ఇప్పుడు లేదు కదా!

తెలుగు పైన ప్రాచీనత నుంచి అధునాతనం వరకు ఏదో ఒక భాషా ప్రభావం విపరీతంగా వున్నట్లు మన భాషా చరిత్ర వల్ల బోధపడుతూ వుంది. సంస్కృత, ప్రాకృత, హిందుస్థానీ (అరబిక్, పర్షియన్) పదాలు తెలుగులోకి చొచ్చుకుని పోయాయి. అవన్నీ స్థిరపడి పోయాయి. కొత్త పదాల బెడద అంతగా లేదు. కానీ ఆధునిక వ్యవహారంలో ఇంగ్లీష్, అంతర్జాలంతో తెలుగు సతమతమవుతోంది. ప్రాచీనానికి వెళితే వేదాల్లో, వేదాంగాల్లో కావలసినన్ని విధి నిషేధాలుండేవి. వ్యాకరణ ప్రశస్తి ఉండేది. అప పాఠాలు, అప పదాలు అపకీర్తికి ఎలా కారణం అవుతాయో మన చరిత్ర చెప్పింది. భాషకు ఎంత హాని చేస్తాయో వివరించింది. అయినా ఆధునిక వ్యవహారంలో అన్యదేశ్యాలు, వాక్యాలు మనం తరచు నిత్య వ్యవహారంలో వాడుతున్నాం. బుక్కులు, పెన్నులు, టిక్కెట్లు, ఇంగ్లీషు బహువచన ప్రత్యయం ‘యస్’, ఆధునిక మాటల వ్యవహారంలో ఇరుక్కుపోయింది. విచ్చలవిడిగా అన్య దేశా పదాలు ప్రధానంగా ఇంగ్లీషు పదాలు ఉపయోగించటం తప్పు అనిపించటం లేదు. కాదు కూడా. దైనందిన జీవితంలో 20వ శతాబ్దంలో ఎన్నో ఆంగ్ల పదాలు వ్యవహార శైలిలో మనం స్వంతం చేసుకోవలసి వచ్చింది. కొన్ని పదాలను అన్య దేశ్యాలుగా గుర్తించటమే కష్టమయ్యేంతగా నోళ్లలో నాని అలవాటైపోయాయి. ఆ విధంగా తెలుగు సరళత, విస్తృతి, వినియోగంతో భాష సుసంపన్నమైంది. ఇండో-ఇరానియన్ భాషా కుటుంబాలకు చెందిన మాటలు ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు అరబ్ దేశంలో పుట్టిన పదం ‘కాఫీ’ ఇంగ్లీషు నుండి మనలోకి వచ్చింది

‘పేపర్లో న్యూస్’, సిన్సియర్ (ట్రై’ చేయటం, ‘బెల్ కొట్టటం ఇంగ్లీషు పదాలను తీసికొని తెలుగు జాతీయ వ్యవహారంతో కలిపి చెబుతున్నాం. చేయడం, కొట్టటం వంటి మాటలకు టైప్, క్వశ్చన్, ఆన్సర్, ఫోన్, వెయిట్, మీటవడం, ప్లాను వేయడం జోడు చేసి చెప్పడం తమాషాగా కలిసిపోయింది. ‘కొట్టు’ అన్న ధాతువుకు సమానార్థకంగా ఆంగ్లంలో ‘స్ట్రైక్’ వాడుతున్నాం. అన్య భాషా పదాలను అవసరాన్ని బట్టి ఇముడ్చుకోవడం తప్పు లేదు. తప్పదు కూడా.

గ్రామీణ ప్రాంతాల్లోనూ స్పీడుగా లగెత్తు, అవుడియా రాలేదు, ప్రోగ్రామ్లు, అయిపోవడం, సిన్మా, ఆక్టర్లు.. ఇలా ఎన్నో పదాలు వాడుకలో ఉన్నాయి. నియమ రహితంగా పదాలు వాడటం అర్థాన్ని మరింత స్పష్టం చేయవలసి రావటం మనం నిత్యం గమనిస్తున్నాం.

శాతవాహన వృత్తాంతంలో “మా ఉదకైః తాడయా” నీళ్లతో కొట్టవద్దు అని రాణి అంటే రాజు ‘ఉండ్రాళ్లతో కొట్టమని అర్థం చేసుకోవటం” లాంటి పరిస్థితి వద్దు. ప్రస్తుతం విద్యార్థులు ‘క్లాసు మార్కులు’ తెచ్చుకోలేనివారు కనీసం ‘పాసు మార్కులైనా’ తెచ్చుకోవాలి కదా! ఋతువు, ఋణం వంటి మాటలు ‘రు’తో రాస్తున్నాం. ఇటీవల ‘కృష్ణ’ అనే పదం కృష్‌లా మార్చి పలకడం వింటున్నాం. తెలుగు మాధుర్యానికి నిసర్గంగా సంక్రమించిన అజంతతను ప్రశంసిస్తూ చెప్పుకొంటున్న ‘ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్’ ప్రతిష్ఠకు మనమే అర్థం తెలియకుండా ఉపయోగించే పదాల కారణంగా అప్రతిష్ఠ మూట కట్టుకుంటున్నాం. అనేక కారణాల వల్ల మన మాతృభాషలోని పదాలు అర్థాలు మాత్రమే కాకుండా భావపరిమళం కోల్పోతున్నాయి. ఏ దేశానికైనా రాజ్యాంగం, ఎంత ప్రాణప్రదమైనదో అదే విధంగా భాషకు నిఘంటువులు, వ్యాకరణం అంత ప్రాణం. పుస్తకాలకు రోజులు చెల్లిపోయాయి యిక ఇంటర్నెట్ తప్ప మరొక దిక్కు లేదనే భవిష్యత్‌లోకి అడుగు పెడుతున్న డిజిటల్ యుగంలో తెలుగును బతికించుకోవాలనే తపన వున్న ప్రతీ అభిమాని, ప్రేమికుడు పుస్తకాలను కూడా ప్రేమించాలి. ప్రతీ ఇంటా ఇంటర్నెట్‌తో పాటు పుస్తకాలను చదవటం బాలబాలికలకు అలవాటు చేయాలి. విద్యా విధానంలో ప్రాథమిక స్థాయి నుంచి తెలుగు వికసింపచేస్తేనే అది సుసాధ్యం. తెలుగు సమాజంలోని మేధావి వర్గం నిర్లిప్తత, నిర్లక్ష్యం వదిలిపెట్టి ప్రభుత్వాన్ని కదిలించాలి. తల్లీ! నిన్ను దలంచి పుస్తకం చేపట్టడం ఎంతైనా ఆరాధ్యనీయం.

- జయసూర్య

తన కోపమే తన శత్రువు

గాంధీజీ మొట్టమొదటిసారిగా ప్రజా జీవితంలో అడుగు పెట్టినప్పటి రోజులవి. ఓ రోజు గాంధీజీ తన మిత్రుడితో కలిసి అతని కారులో ప్రయాణం చేస్తున్నారు. గాంధీజీ అలా ప్రయాణం చేయడం నచ్చని కొందరు వ్యతిరేకులు ఆయనకు అడ్డంకులు కల్పించడానికి ఓ చెట్టు చాటు నుంచి కారుపై రాళ్లు రువ్వారు.

రాళ్లు కారు మీద పడగానే గాంధీజీ మిత్రుడితో కారును ఓ పక్కగా ఆపమన్నారు.

అనంతరం ఆయన కారులోంచి కిందకు దిగారు. చుట్టూ చూశారు. కనుచూపుమేరలో ఓ చెట్టు దగ్గర నిల్చున్న కొందరిని గాంధీజీ చూశారు. వారు తప్ప మరెవ్వరూ కనిపించలేదు. దాంతో తిన్నగా వారి దగ్గరకు వెళ్లారు. వాళ్లే రాళ్లు విసిరి ఉండొచ్చని అనుకున్నారు.

వారిని సమీపించి "మీకు నా మీద కోపం ఉండొచ్చు. కాదనను. ఆ కోపం మీ వరకూ సబబే కూడా. అయి ఉండొచ్చు. అది కూడా నేను కాదనను. కనుక మీ కోపాన్ని చూపాలనుకుంటే నామీద రాళ్లు విసరాలి. ఈ కారు ఏం చేసింది? అది మిమ్మల్నేమీ చెయ్యలేదుగా? అంతేకాదు, ఆ కారు కూడా నాది కాదు. నా మిత్రుడిది. ఇప్పుడు కూడా చెప్తున్నాను. మీరు మీ కోపాన్ని నా మీద చూపండి. ఇదిగో మీ ముందే నిల్చున్నాను. మీ ఇష్టమొచ్చినట్టు చేసుకోండి, నేను మీ ముందు ఒంటరిగా నిల్చున్నాను. నన్ను మీరేమైనా చేసుకోవచ్చు. నేనేమీ అనుకోను. కారు మీద రాళ్ళు విసరడం వల్ల అది మిమ్మల్నేమీ చెయ్యలేదు. చెయ్యదు కూడా. కానీ కారు నాశనమవుతుంది. అప్పుడు నా మిత్రుడు బాధపడతాడు. నష్టం అతనికి తప్ప నాకు కాదుగా" అని గాంధీజీ అన్నారు.

గాంధీజీ మాటలు విని ఆయనను ఆట పట్టించాలనుకున్నవాళ్ళు గాంధీజీ మాటలకు సిగ్గుపడి తల దించుకున్నారు. కాస్సేపు అక్కడ మౌనం తాండవించింది. అనంతరం ఆ అల్లరిమూక గాంధీజీ కాళ్లపై పడి తమను క్షమించాలని అడిగారు.

అయితే గాంధీజీ వారితో ఇలా అన్నారు.

"ఇప్పటికైనా మీ తప్పు మీరు తెలుసుకున్నారు. ఇప్పుడే కాదు, ఇంకెప్పుడైనా సరే, మీకు ఎవరి మీద కోపముంటే వారి పైనే మీ కోపాన్ని చూపించండి. అంతేతప్ప మరొకరిపై మీ అక్కసును వెళ్ళబోసుకోవడం సరైంది కాదు. అయినా కోపాన్ని మీరు సక్రమమైన వాటికి ప్రదర్శిస్తే అది నలుగురికీ ఉపయోగపడుతుంది. అంతేతప్ప కోపం సరైన పద్ధతికాదు. తన కోపమే తన శత్రువు అనేది తెలుసుకోండి.

ఈర్ష్యా ద్వేషాలు ఎప్పుడూ పనికిరావు. అవి వినాశనానికే తప్ప మన ఎదుగుదలకు తోడ్పడవు. కోపం వల్ల విచక్షణ కోల్పోతాం. అప్పుడు మనం మాట్లాడే మాటలు ఎదుటి వారిని గాయపరచినట్టు అనుకుంటాం.

కానీ ఆ తర్వాత మనం స్థిమితంగా ఓ చోట కూర్చుని ఆలోచిస్తే మన పెదవి దాటిన ఆ మాటల వల్ల కలిగే నష్టం ఎంతన్నది తెలిసి బాధపడతాం. అంతకన్నా నాలుగు దెబ్బలు భరించవచ్చేమో కానీ పెదవి దాటిన మాటలు జీవితాంతం మనిషిని నొప్పిస్తూనే ఉంటాయి.

అందుకే కోపాన్ని వీలున్నంతవరకూ నియంత్రించుకోవడం మంచి పద్ధతి. కోపం ఎందుకు వచ్చిందో నిదానంగా ఆలోచిస్తే తప్పెవరిదో బోధ పడుతుంది. నిజంగానే తప్పు మనదైతే క్షమించమని అడగడం, లేదా వారిది తప్పయితే వారే క్షమించమని మనల్ని అడగడం ఉభయులకూ శ్రేయోదాయకం. అంతేకాదు.. కోపానికి తెర పడుతుంది" అని చెప్పారు.

- యామిజాల జగదీశ్

రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

‘మురజ వేధ’ వల్ల ఫలితాలు?

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458

ఒక గృహానికి సింహద్వారం చాలా ముఖ్యమైంది. సింహద్వార నిర్మాణానికి ఉపయోగించే కలప, కలప ముక్కల సంఖ్య ద్వారా బంధ ప్రతిష్ఠ విధానం, ముహూర్తం మొదలైన అనేక విషయాలలో చాలా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ద్వారబంధ ప్రతిష్ఠలో ఏ చిన్న పొరపాటు జరిగినా ‘మురజవేధ’ దోషం చోటు చేసుకుంటుంది. పార్శ్వోన్నతంచ మురదం అని అంటారు.

అంటే ద్వార బంధంతో కూడిన సింహద్వారం పార్శ్వములు హెచ్చుతగ్గులుగా ఉన్నట్లయితే (వంకరగా గానీ, ద్వార బంధ నిర్మాణంలో వచ్చిన లోపం వల్ల గానీ) ‘మురజవేధ’ దోషం కలుగుతుంది.

కనుక ఇలాంటి దోషం ‘వంశాభివృద్ధి విషయంలో దుష్పరిణామాలను కలుగచేస్తుంది. సంతానం కలగకపోవటం, వంశాభివృద్ధి కుంటుబడటం. వంశాంకురం విషయంలో ఫలితం కనబడకపోవటం, వంశం నశించిపోతుందేమోనని భయాందోళనలు కలుగుతున్నట్లయితే కుటుంబ యజమాని తను నివాసముంటున్న ఇల్లు లేదా స్వంత ఇంటి సింహద్వారానికి ‘మురజవేధ’ దోషం ఉందేమో చూసుకుని, దానిని సరిచేసుకోవటం మంచిది. సంతానం కలగకపోవటానికి వున్న అనేక భౌతిక కారణాలలో ఇటువంటి వాస్తు దోషాలుండటం కూడా ఒక కారణం.

వాస్తుదోషాల వల్ల కలిగే చెడు ఫలితాలు వాస్తు దోషాలను సవరించుకోవడం ద్వారా తప్పకుండా నివారించబడతాయి. ఒకవేళ సింహద్వాం ప్రతిష్ఠలో మురజవేధ దోషముంటే ఆ దోషాన్ని సవరించుకొని, సంతాన హీనత లాంటి దోషాల నుండి బయట పడి చక్కని సంతానాన్ని పొంది వంశాభివృద్ధిని సాధించుకోవచ్చు.

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం ‘వాస్తువార్త’లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: **సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

వాస్తువార్త

పూర్తి పేరు : ....

పుట్టిన తేది : ....

జన్మ నక్షత్రం: ....తల్లి పేరు: ....

చిరునామా:..

ఈశాన్యంలో ఎలాంటి బరువులు ఉండకూడదు?

ఎన్.అనసూయ, కడప

ప్రశ్న: ఈశాన్యంలో బరువు అంటే ఏమిటి?

జవాబు: ఈశాన్యం బరువు ఒక గృహానికి లేదా స్థలానికి ఈశాన్య మూలలో 1) బరువు ఎక్కువగా ఉన్న వస్తువులు పెట్టటం (ఉదా: గృహ నిర్మాణ సమయంలో ఇటుక, రాయి, ఇసుక మొదలైన వాటిని ఆ స్థలంలోనే ఈశాన్యం మూలలో తాత్కాలికంగానైనా డంప్ చేయటం. 2) పై అంతస్తుకు వెళ్లటానికని ఈశాన్య మూలలో మెట్లు నిర్మించటం. 3) గృహానికి ఈశాన్య మూలలో పూజగది నిర్మాణ క్రమంలో ఎత్తయిన సిమెంటు షెల్ఫులు లేదా గ్రానైట్, పాలరాతి నిర్మాణాలు గావించటం. 4) ఈశాన్య ముఖ ద్వారానికి ఇరువైపులా అందంగా కనిపించటానికి వివిధ రకాల రంగుల గ్రానైట్ పలకలు లేదా టైల్స్ అతికించటం. 5) ఖాళీ స్థలంలో పూర్తి ఈశాన్య మూలలో ఏదైనా ఉప గృహ నిర్మాణం గావించటం(దీనిని ‘ఈశాన్య మూత’ అని కూడా అంటారు). 6) పూర్తి ఈశాన్య మూలలో ఏపుగా పెరిగిన చెట్లుండటం. 7) ఆవరణలోని ఈశాన్యంలో పప్పు రుబ్బే రోలు, పాత్రం ఉండటం, పాత సామానులు చేరవేసి ఉండటం. 8) గృహం లేదా ఆవరణలోని ఈశాన్య భాగంలో బరువైన పనిముట్లు, పాదరక్షలు, చీపుర్లు, చెప్పుల స్టాండు, అలమారలు, చుట్టిన చాపలు, పరుపులు, మంచాలు మొదలైనవన్నీ ఈశాన్య బరువు అనే అంశం కిందికే వస్తాయి. ఈశాన్యంలో బరువులు ఉండటం వాస్తు దోషం అవుతుంది. ఇటువంటి దోషం వలన ఆర్థిక వనరుల గురించి, సంతానం, పరువు ప్రతిష్ఠల గురించి దుష్ఫలితాలు కలుగుతాయని పేర్కొన్నారు. అలాగే ‘ఈశాన్య మూలలో బరువు పెట్టకూడదన్న’ వాస్తు నియమాన్ని గౌరవించటం వలన ఎన్నో విధాల మంచి ఫలితాలను కూడా పొందవచ్చు.

ఎవరైనా పైన పేర్కొనబడిన దుష్ఫలితాల వల్ల బాధపడుతున్నట్లయితే వారి గృహ ఆవరణలోని ఈశాన్య మూలలో ఏవైనా బరువులున్నాయేమో గమనించి, వాటిని అక్కడి నుండి తీసి వేయటం వల్ల అతి శీఘ్రంగా ఆ బాధలు తగ్గి మెరుగైన ఫలితాలు పొందవచ్చు.

గరుత్మంతుడి ఆలయం

కేరళలో అరుదైన దేవాలయాలు ఎన్నో నిపిస్తాయి. అలాంటి ప్రత్యేక ఆలయాల కోవలోనిదే 'వెళ్ళమశ్శరీ గరుడన్ కావు'. శ్రీ మన్నారాయణుని సేవలలో నిరంతరం తరించేవిగా సుదర్శన చక్రం, పాంచజన్యం (శంఖం), కౌమోదకి (గద), ఆదిశేషువు, గరుత్మంతుడు ముఖ్యమైనవిగా చెప్పుకోవాలి. శంఖం, గద శ్రీహరి హస్త భూషణాలుగా ప్రసిద్ధి. వీరిని 'నిత్య సూరి' అని పిలుస్తారు. స్వామి ఆనతి మేరకు ఎందరో లోకకంటకులను హతమార్చిన సుదర్శన చక్రానికి శ్రీ వైష్ణవ పూజా విధానంలో విశేష ప్రాముఖ్యం ఉన్నది. సర్వాంతర్యామికి వాహనంగా ప్రసిద్ధి గరుత్మంతుడు. ప్రతి విష్ణు ఆలయంలో ధ్వజస్తంభం వద్ద వినమ్రంగా జోడించిన హస్తాలతో ఉండే వినతాసుతుని మనందరం చూస్తూనే ఉంటాం. కానీ అతనికి ప్రత్యేకంగా ఉన్న ఏకైక కోవెల మాత్రం గరుడన్ కావులో కనపడుతుంది. భారతదేశంలో పక్షిరాజుకు ఉన్న ఆలయమిదొక్కటేనని తెలుస్తోంది.

ఆలయ గాథ

ఎన్నో యుగాలకు పూర్వం ఒక మహామునికి మానవ జీవిత అర్థం, పరమార్థం గురించి స్వయంగా వైకుంఠనాథుడే తెలిపే సమయంలో వాహనమైన గరుడుడు పక్కనే ఉన్న కోనేరు వద్ద వేచి ఉన్నాడట. అలా పరమాత్మ సంచరించిన స్థలంగా ప్రసిద్ధికెక్కిన ఆ ప్రదేశంలో కొన్ని కుటుంబాలు శ్రీ జగన్నాథుని ఆలయం నిర్మించుకొని ఆరాధించుకోనేవి. ఆ కాలంలో పేరొందిన శిల్పి "పేరున్ థాచన్" (కేరళలోని ప్రముఖ ఆలయాల నిర్మాణాల వెనుక ఉన్నది ఈయనే అన్న ఒక విశ్వాసం) స్థానిక వేట్టాతునాడు పాలకుని వద్దకు వచ్చాడట.

మహా శిల్పిని సాదరంగా ఆహ్వానించిన రాజు ఆయన చేతిలో సహజత్వాన్ని కలిగి ఉన్న గరుడ బొమ్మను చూసి శిల్పి నేర్పరితనాన్ని కొనియాడారు. దానికి "పేరున్ థాచన్" పతివ్రత అయిన స్త్రీ గనుక తాకితే ప్రాణం పోసుకొని ఎగురుతుంది అని సమాధానమిచ్చారట. అంతఃపుర స్త్రీలు కావాలంటే పరీక్షించుకోవచ్చు..." అని కూడా అన్నారట.

ఆ మాటకు ఆగ్రహించిన రాజు శిల్పి భార్యను రప్పించి తాకించారట. ఆమె చేతి స్పర్శ తగలగానే ఆ చెక్క గరుడ శిల్పం ప్రాణం పోసుకొని గాలిలోకి ఎగిరినదట. ఆశ్చర్యపోయిన రాజు శిల్పిని క్షమాపణ కోరి గరుడపక్షి వెళ్లిన మార్గంలో వెదకడానికి భటులను పంపారట.

వెంటాడిన భటులు సమీపంలోని కోనేరులో తెల్ల తాబేళ్ల మీద వాలి ఉన్న పక్షిని కనుగొన్నారట. తరలి వచ్చిన రాజు ఈ క్షేత్రం ప్రాముఖ్యం తెలుసుకొని శిల్పాచార్యుని చేతనే ఇక్కడ ఒక నూతన ఆలయం శ్రీ మహావిష్ణువుకు, గరుత్మంతునికి కట్టించారట. ఆనతి కాలంలోనే విశేష ప్రాముఖ్యత పొందిన ఆలయంగా పేరు గాంచింది.

తదనంతర కాలంలో మైసూరును పాలించిన టిప్పు సుల్తాన్ కేరళ ప్రాంతం మీద జరిపిన దాడులలో తొలుత పేరున్ థాచన్ చేత నిర్మించబడిన ఆలయం పూర్తిగా ధ్వంసం అయినట్లు తెలుస్తోంది. మూల విరాట్టులు సుమారు 1800 సంవత్సరాలుగా పూజలందుకొంటున్నా ప్రస్తుత ఆలయం మాత్రం రెండు వందల సంవత్సరాల క్రితం నిర్మించబడినది.

ప్రశాంత వాతావరణంలో గుబురుగా పెరిగిన వృక్షాల మధ్య తూర్పు, పడమర ద్వారాలు కలిగిన ఈ ఆలయం ఉంటుంది. పురుషులు తప్పనిసరిగా ధోతి ధరించాలి. ధ్వజస్తంభం, బలిపీఠాలు లేని ప్రాంగణంలో ఒక పక్క అంబల కార్యాలయం, మరో పక్క ప్రసాద విక్రయశాల ఉంటాయి.

ధ్వజస్తంభ స్థానంలో నిలువెత్తు రాతి దీప స్థంభం ఉంటుంది. చిన్న ద్వారం గుండా లోపలికి వెళితే లోపల మూడు చతురస్రాకార శ్రీ కోవెలలు, రెండు నమస్కార మండపాలు కనపడతాయి. ఇవన్నీ నూతనంగా ఆధునిక విధానంలో పురాతన శైలిలో నిర్మించారు. ఎదురుగా రెండంచెల గోపురాలున్న ప్రధాన గర్భాలయంలో శ్రీ మహా విష్ణువు చతుర్భుజుడై స్థానక భంగిమలో దర్శనమిస్తారు. లోపల తాబేలు రూపంలో శ్రీ కూర్మనాథ స్వామి కూడా దర్శనమిస్తారు. పక్కనే చిన్న ఉపాలయంలో శ్రీ వినాయకుడిని దర్శించుకోవచ్చు.

కేరళ ఆలయాలలో అధికంగా శ్రీగణపతి, శ్రీ ధర్మశాస్త్ర ఉపాలయాలలో దర్శనమిస్తారు. శ్రీ మన్నారాయణుడు కొలువైన ప్రధాన శ్రీ కోవెల వెనుకే శ్రీ గరుత్మంతుని సన్నిధి, చందన పుష్పాలంకార శోభితుడైన గరుడుడు ఎగరడానికి సిద్ధంగా రెక్కలు విప్పుకొన్న భంగిమలో దర్శనమిస్తాడు. గతంలో రాజభటులకు కొలనులో అదే భంగిమలో కనపడినందున అలానే మూర్తిని ప్రతిష్టించారని కథనం. గరుడునికి ఇరుపక్కలా ఉన్న సన్నిధులలో సదాశివుని మరో రూపమైన 'వేట్టక్కారాన్', 'కార్తవీర్యార్జున్' భక్తులకు దర్శనమిస్తారు.

మరో ఆలయంలో శ్రీ శంకర నారాయణ స్వామి, చివర ఉన్న ఆలయంలో కైలాస వాసుడు కొలువుతీరి ఉంటారు. ప్రాంగణంలో శ్రీకూర్మనాథ స్వామి సన్నిధి కూడా ఉండటం ఈ ఆలయ ప్రత్యేకత. ప్రధాన గర్భాలయం తప్ప మిగిలినవన్నీ నూతనంగా నిర్మించబడినవి. ఈ ఆలయంలో ముఖ్య దైవం శ్రీహరి అయినా ప్రాధాన్యం శ్రీ గరుత్మంతునికే ఉండటం ప్రత్యేకం.

గరుత్మంతుడు

కశ్యప ప్రజాపతి భార్యలైన కద్రువ, వినుతల మధ్య సహజంగా సవతుల మధ్య ఉండే స్పర్థ ఉండేది. కద్రువ చేసిన మోసానికి వినుత ఆమెకు దాసిగా ఉండవలసి వచ్చింది. కద్రువ సంతానం నాగులు. వినుత సంతానంలో ఒకరు శ్రీ సూర్యనారాయణుని రథ సారథి అయిన 'అనూరుడు'. రెండవ అమిత పరాక్రమశాలి అయిన 'గరుత్మంతుడు'. తల్లికీ, తనకి దాస్య విముక్తికి సవతితల్లి కోరినట్లుగా దేవలోకం నుండి అమృతాన్ని తెచ్చినవాడు గరుత్మంతుడు. దేవేంద్రుని సలహా మేరకు నాగులకు అమృతం అందకుండానే దాస్యవిముక్తి పొంది శ్రీ వైకుంఠవాసుని వాహనంగా శాశ్వత వైకుంఠ నివాస స్వామి సేవా భాగ్యం అందుకొన్నాడు. అలా గరుడుని నాగులకు ఉన్న శత్రుత్వం అంతులేనిది. నాగసర్పదోషం, సర్ప శాపం వల్ల వివాహం కానివారు, సంతానం లేనివారు, అనారోగ్య పీడితులు ఈ ఆలయానికి వస్తుంటారు.

మూల విరాట్టు రూపం

కేరళలో శ్రీ మహావిష్ణువు శ్రీ రామునిగా/శ్రీకృష్ణునిగా కొలువు తీరినా చతుర్భుజాలతో దర్శనం ఇవ్వడం విశేషం. తిరువనంతపురంలో మాత్రమే శ్రీ అనంతపద్మనాభుడు శయన భంగిమలో దర్శనమిస్తారు. గరుడన్‌కావులో కూడా శ్రీవారు చతుర్భుజాలతో స్థానక భంగిమలో నేత్రపర్వంగా కనిపిస్తారు. వైష్ణవ ఆలయాలలో గరుత్మంతుడు స్థానక భంగిమలో ముకుళిత హస్తాలతో వినమ్ర ముద్రలో గర్భాలయానికి ఎదురుగా ధ్వజస్థంభం వద్ద దర్శనమిస్తారు. అరుదుగా ఒక కాలు వంచి మరో కాలు నేలకు తాకించి అంజలి జోడించిన గరుత్మంతుని చూడవచ్చు. కానీ ఇక్కడ మాత్రం విప్పార్చుకొన్న రెక్కలతో స్థానక భంగిమలో ఆ హస్తాలలో అమృత భాండాన్ని ఉంచుకొని కనిపిస్తారు. వినుతాసుతుడు ప్రధాన అర్చనామూర్తిగా కొలువు తీరిన ఈ ఏకైక క్షేత్రంలో ఆయన రూపం కూడా తగినట్లుగా ఉండటం ప్రత్యేకం.

ఆలయ ప్రత్యేకతలు

కేరళ రాష్ట్రంలో విశేష ఆదరణ కలిగిన గరుడన్ కావు ఆలయంలో నిత్య పూజలు నియమంగా జరుగుతాయి. ఉదయం నాలుగు నుండి పదిన్నర వరకు; తిరిగి సాయంత్రం అయిదు నుండి రాత్రి ఎనిమిది వరకు ఆలయం తెరిచి ఉంటుంది. ఆదివారాలు, పర్వదినాలలో వేళలను మారుస్తారు. ముఖ్యంగా ఆదివారాలలో దూరప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు గరుడన్ కావు వస్తుంటారు. ఈ ఆలయంలో భక్తులకు వారి సమస్యల నుండి ఉపశమనం కలిగించే పూజ లేదా చికిత్సా విధానం చాలా ప్రత్యేకంగా ఉంటుంది.

నిజ సర్ప బంధనం

భక్తులు ముఖ్యంగా అనారోగ్య పీడితులు, సర్ప దోషం లేదా కుజ దోషం ఉన్నవారు ఎక్కువగా వస్తుంటారు. రాహు/కుజ దోషం వున్నవారు ఇక్కడ నాగ ప్రతిష్ట జరిపిస్తారు. ప్రాంగణమంతా ఎన్నో నాగ శిలలు లెక్కకు మిక్కిలిగా కనపడతాయి. నాగ దోషం ఉన్న భక్తులు కొందరు జోతిష్యుల సలహా మేరకు నాగ పంచమి లేదా నాగ చవితి లాంటి ప్రత్యేక రోజులలో బతికి ఉన్న సర్పాన్ని మట్టి కుండలో బంధించి తెచ్చి మూలవిరాట్టు ముందు కుండను పగలకొడతారు. బుసలు కొడుతూ బయటికి వచ్చిన పామును ఆలయ పూజారి గరుడ పంచాక్షరి మంత్రంతో శాంతింపచేస్తారట. శాంతించిన పాము ఆలయ బయటికి వెళ్లిపోతుందట. ఇలా చేయడం ద్వారా వంశానికి తరతరాల నుండి వస్తున్న సర్ప దోషం తొలగిపోయిందని అంటారు. తిరిగి ఆ వంశంలో ఎవరూ నాగ దోష పీడితులు కారని నమ్ముతారు.

కేరళ రాష్ట్రంలో మన్నార్ శాలలో ప్రముఖ నాగరాజ స్వామి ఆలయం ఉన్నది. అక్కడ కూడా ఇలా సర్పాన్ని తెచ్చి గరుడ మంత్రంతో బంధించే ప్రక్రియ చేస్తారు. గరుడుని మహత్యమో మరొకటో.. ఎన్నో సంవత్సరాల నుండి ఇక్కడ ఎవరూ పాము కాటుకు గురి కాలేదని తెలుస్తోంది.

కంద దుంప చికిత్స

చర్మవ్యాధులు ఉన్నవారు దుంపకూరలు తినకూడదని ఆయుర్వేదం చెబుతోంది. కానీ ఇక్కడ అదే కంద దుంప సమర్పణ వ్యాధిని తగ్గించడం ఒక విశేషంగా పేర్కొంటారు. దీర్ఘకాలం చర్మ వ్యాధులతో బాధపడేవారు మూడు ఆదివారాలు వచ్చి స్వామిని ఆరాధిస్తే సమస్త చర్మ, శ్వాస కోశ వ్యాధులు తొలగిపోతాయని తరతరాల నమ్మకం.

అర్చన, పూల అలంకరణ, అభిషేకం ఇలాంటివి కాకుండా గరుడన్ కావు ఆలయంలో కంద దుంప సమర్పణ చికిత్స కనపడుతుంది. వ్యాధిగ్రస్తులు ఒక కంద దుంపను, ఒక లోహ నాగ రూపాన్ని తీసుకొని అర్చకస్వామి సూచనల ప్రకారం తమ చుట్టూ తిప్పుకొని సంపూర్ణ విశ్వాసంతో ప్రార్థిస్తారు. ఆ సమయంలో మంత్రం పఠనం చేస్తారు అర్చకులు.

ఈ విషయం తెలియనివాళ్లు అక్కడ ఉన్న దుంపను ఉపయోగించుకొని దానికి బదులుగా యథాశక్తిగా పైకాన్ని హుండీలో వెయ్యవచ్చు. ఆ విధంగా చేయడం వలన వ్యాధి గణనీయంగా తగ్గిపోతుందని విశ్వాసం.

మలయాళీ పంచాంగం ప్రకారం నవంబర్-డిసెంబర్ మధ్య వచ్చే వృశ్చిక మాసంలో జరిపే మండల పూజలలో వేలాదిగా భక్తులు పాల్గొంటారు. పొంగలి, పండ్లు శ్రీ గరుత్మంతునికి సమర్పించుకొంటారు. అన్ని హిందూ పర్వదినాలలో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయంలో ఆర్జిత సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రాంగణంలో శ్రీ ధర్మశాస్త్ర, భద్రకాళి సన్నిధులుంటాయి. గరుడన్ కావు కేరళ రాష్ట్రంలోని మలప్పురం జిల్లాలో ఉన్నది. షోరనూర్ లేదా గురువాయూరు నుండి తిరూర్ మీదుగా ఇక్కడికి చేరుకోవచ్చు.

- ఇలపావులూరి వెంకటేశ్వర్లు

హాస్యానికి చిరునామా..

విజయనగర సామ్రాజ్య రాజు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో ఒకరిగా ప్రసిద్ధి చెందిన తెలుగు కవి, పండితుడు, సలహాదారు తెనాలి రామకృష్ణుడు. ఈయనను తెనాలి రామలింగడు అని కూడా పిలిచేవారు. స్మార్త శాఖకు చెందిన నియోగి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన రామకృష్ణుడు, తన పదునైన హాస్యం, తెలివితేటలు, కవితా నైపుణ్యంతో 'వికటకవి' (హాస్య కవి) అనే బిరుదును పొందారు. మొదట గార్లపాటి రామకృష్ణుడిగా ఉన్న అతను తెనాలి వచ్చినందున తెనాలి రామకృష్ణుడిగా ప్రసిద్ధి చెందారు. తెనాలిలో రామకృష్ణకవి మేనమామలు ఉండేవారు.

జీవిత విశేషాలు

తెనాలి రామకృష్ణని పేరు వినగానే హాస్య కథలు గుర్తుకు వస్తాయి. ఎవరీ తెనాలి రామకృష్ణుడు? తెనాలి ఎక్కడ ఉంది? అని మూలాల్లోకి వెళితే ఎన్నో విషయాలు మనకు తెలుస్తాయి. తెనాలి గుంటూరు జిల్లాలో ఉంది. తెనాలి రామకృష్ణడికి తల్లిదండ్రులు పెట్టిన పేరు రామలింగస్వామి. గార్లపాటి రామన్నమంత్రి, లక్ష్మమాంబ దంపతులకు 1480 సెప్టెంబర్ 22 రామలింగస్వామి జన్మించారు. రామలింగడి తండ్రి రామన్నమంత్రి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రధాన అర్చకుడిగా పనిచేసేవాడు. తెనాలిలోని రామేశ్వరాలయంలోనే రామకృష్ణనికి రామలింగస్వామి అని నామకరణం చేశారు. ఈ దంపతులకు ముగ్గురు సంతానంలో పెద్దవాడు రామలింగడు. కాగా రెండవ వాడి పేరు అన్నయ్య. మూడవవాడి పేరు వరరాఘవకవి. రామలింగస్వామి ముత్తాత, తాత, తండ్రి అందరూ గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలంలోని లక్కరాజుగార్లపాడు గ్రామానికి చెందినవారు. వీరి ఇంటి పేరు గార్లపాటి రామలింగస్వామి. పూర్వీకులు నివసించిన గార్లపాడును లక్కరాజు అనే వ్యక్తి స్థాపించడంతో దానికి లక్కరాజుగార్లపాడు అనే పేరు వచ్చింది. వారు గార్లపాడులో నివసించిన ఇంటి ప్రదేశంలో ప్రస్తుతం గ్రామస్థులు గుర్తుగా బొడ్రాయిని ఏర్పాటు చేశారు. రామలింగకవి తాత అప్పన్న కవి సుదక్షిణా పరిణయం అనే గ్రంథాన్ని రాశాడు.

బాల్యంలో రామలింగస్వామి చదువు, సంధ్య లేకుండా అల్లరి చిల్లరిగా తిరిగేవాడు. తండ్రి రామన్నమంత్రి మరణించిన తరువాత ఆ కుటుంబం లక్కరాజుగార్లపాడు నుండి తెనాలిలో ఉన్న మేనమామ ఇంటికి వలస వచ్చారు. మేనమామ సంరక్షణలో రామలింగడు విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. రామలింగడు తెనాలిలో పుట్టలేదు. అయితే కొన్నేళ్లపాటు తెనాలిలో పెరిగి విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. తెనాలి రామలింగస్వామి కొద్ది కాలం గుంటూరు జిల్లా పెదకాకాని మండలం దేవరాయ భొట్లపాలెంలో విద్యాభ్యాసం చేశారు. తెనాలికి 15 కి.మీ. దూరంలో ఉన్న ఈ గ్రామానికి ప్రతిరోజూ ఆయన నడచుకుంటూ వెళ్ళేవారు. అష్టదిగ్గజ కవులలో ఒకరైన భట్టుమూర్తి అనే మరో కవి స్వగ్రామం కూడా ఈ దేవరాయ భొట్లపాలెమే. ప్రస్తుతం తెనాలి రామకృష్ణకవికి చెందిన వారసులెవరూ తెనాలిలో లేరు.

ప్రకాశం జిల్లాలో ఆ కాలానికి చెందిన చదలవాడ గ్రామ వాస్తవ్యుడు లింగంగుంట్ల తిమ్మకవి తెనాలి రామకృష్ణనికి మేనల్లుడు. ఇతనికే రామకృష్ణుడు తన కుమార్తెనిచ్చి వివాహం చేశారు. ఆ ప్రాంతంలో కూడా నేటికీ తెనాలి రామకృష్ణ వారసులు లేరు. రామకృష్ణునికిగానీ అతని రెండవ తమ్ముడు అన్నయ్యకుగానీ వారసులు ఉన్నట్లు ఆధారాలు లేవు. కొందరైతే కుమార్తెకు సంబంధించిన వారసులు ఉన్నారు అంటారు. దానికి కూడా సరైన ఆధారాలు లేవు. అయితే రామకృష్ణకవి మూడవ తమ్ముడైన వరరాఘవకవి కుమారుడైన ఇమ్మడి రామకృష్ణుడు రామకృష్ణకవి తన పెద్దనాన్న అని చెప్పుకున్న సందర్భాలు

ఉన్నాయి. రామకృష్ణకవి తెనాలి నుండి హంపీ విజయనగరం వెళ్ళడం వల్ల పేరుకు ముందు తెనాలి చేరింది. తెనాలి ఉన్న సమయంలో ఇక్కడి రామలింగేశ్వరస్వామిని (పాత శివాలయం) ఆరాధించేవారు.

రామలింగస్వామి తండ్రి రామన్నమంత్రి శివభక్తుడు. కావడంతో ఈ ఆలయానికి ఉత్సవ విగ్రహాలు తయారు చేయించారు. రామన్నమంత్రి సోదరుడైన లక్ష్మయ్య గొప్ప కవి, పండితుడు. విద్యాభ్యాసం కోసం తొలుత తెనాలిలో పాలగుమ్మి ఏకేశ్వరుని వద్ద రామలింగడిని చేర్చారు. వేద పఠనంతో అతని విద్యాభ్యాసం ప్రారంభమైంది. తొలుత రామలింగడు సరిగా చదవలేదు. అల్లరి చిల్లరిగా తిరిగేవాడు అనంతరం వ్యాకరణం అలంకార శాస్త్రాలు తెలుసుకుని పురాణాలను, ప్రబంధాలను, కావ్యాలను చదివాడు. విజయనగరం వెళ్ళిన కొద్ది రోజులకే ఆయన శైవమతం నుండి వైష్ణవ మతానికి మారడంతో రామలింగడిగా కాక రామకృష్ణ కవిగా పేరు మారింది.

హంపీ విజయనగర పయనం

శ్రీకృష్ణదేవరాయలు కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళం వచ్చిన సందర్భంలో స్వయంగా కలిశారు. ఆ కాలంలో కొండవీడు గొప్ప దుర్గంగా ప్రసిద్ధి చెందింది. ఆ దుర్గాన్ని గోపన్నమంత్రి పరిపాలించేవాడు. ఇతను శ్రీకృష్ణదేవరాయలవారి మంత్రి అయిన తిమ్మరుసుకు మేనల్లుడు. గోపన్న కూడా మంచి కవి. అతని వద్ద ఊర దేవయ్య అనే రాజ కార్య నిర్వాహకుడు ఉండేవాడు. ఇతను కూడా గొప్ప పండితుడే కాక శివభక్తుడు కూడా. శ్రీకృష్ణదేవరాయలవారి అహ్వానం మేరకు ఊర దేవయ్య హంపీ విజయనగరానికి వెళ్లాడు. ఊర దేవయ్య రామలింగ కవిని కూడా తనతో పాటు హంపీ విజయనగరం తీసుకుని వెళ్ళాడు. రామలింగకవి రచనలు విని దేవయ్య ప్రశంసించేవాడు. రామలింగకవి చేత ఒక కావ్యాన్ని రాయించుకుని అంకితం పుచ్చుకోవాలనే కోరికను ఒక సందర్భంలో ఆయన వ్యక్త పరిచాడు. అప్పట్లో శివభక్తుడైన రామలింగ కవి ఆ కోరికను మన్నిస్తూ ఉద్భటారాధ్య చరిత్ర అనే శైవ ప్రబంధాన్ని రాసి దేవయ్యకు అంకితమిచ్చాడు. ఇది ఉద్భటుడు అనే యతి గాథ, ఈ కావ్యం రచించిన అనంతరం పాతికేళ్ళ ప్రాయం కలిగిన రామలింగ కవికి శ్రీకృష్ణదేవరాయలవారి ఆస్థానంలో ప్రవేశం లభించింది. వైష్ణవ మతం స్వీకరించిన అనంతరం రామకృష్ణకవి హరి లీలా విలాసం అనే కావ్యాన్ని రచించాడు. ఆ కావ్యాన్ని విన్న రాయలవారు ఎంతో ప్రశంసించి తన ఆస్థానంలోని అష్టదిగ్గజలలో ఒకరిగా రామకృష్ణకవిని నియమించారు. అష్టదిగ్గజ కవులతో రాయలవారి భువనవిజయం నిత్యకళ్యాణం పచ్చతోరణంగా వెలుగొందుతూ సాహితీ సుగంధాలను వెదజల్లేది. అంతేకాక రామకృష్ణకు తన తెలివితేటలతో రాయలవారితో పాటు విజయనగరానికి ఎంతో మేలు చేసేవారు.

ఆ తరువాత కొద్దికాలానికి రామకృష్ణకవి ఘటికాచల మహాత్యం పేరుతో మరో కావ్యాన్ని రచించారు. తమిళనాడులోని వేలూరు మండలంలో ఉన్న ఘటికాచలం ప్రస్తుతం దీన్ని షోలింగర్ అని పిలుస్తున్నారు. ఈ క్షేత్రంలో వెలసిన శ్రీ నరసింహ స్వామివారిని స్తుతిస్తూ రాసిన కావ్యం ఇది. రామకృష్ణకవి రచించిన హరిలీలా విలాసము, కందర్పకేతు విలాసము ఇత్యాది గ్రంథాలు అలభ్యం. జగ్గన రచించిన ప్రబంధ రత్నాకరంలోని కొన్ని పద్యాల వల్ల ఈ గ్రంథాల వివరాలు తెలుస్తున్నాయి.

సాహిత్య రచనలు

పాండురంగ మహాత్యం తెలుగు సాహిత్యంలో పంచ మహాకావ్యాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఇది క్షేత్ర మాహాత్యంతో కూడిన కావ్యం. **ఉద్భటారాధ్య చరిత్రం** ఈ కావ్యంలో అతని విలక్షణమైన కవితా శైలి కనిపిస్తుంది. **ఘటికాచల మహాత్యం** మరొక ముఖ్యమైన రచన.

రామకృష్ణకవి హంపీ విజయనగరంలో ఎక్కువ కాలం నివసించలేదు. విజయనగర సామ్రాజ్య పతనం తరువాత తెనాలి చేరి అగ్రహార నిర్ణేతగా ఖ్యాతినార్జించాడు. తెనాలి పాత శివాలయం కోసం కవిగారి తండ్రి వేయించిన ఉత్సవ విగ్రహాలను దొంగలు కాజేశారు. ఈ విషయం తెలిసిన రామకృష్ణకవి ఉత్సవ విగ్రహాలను మళ్లీ తయారు చేయించి ఆలయానికి సమర్పించారు. ఈ విగ్రహాలు ఇప్పటికీ తెనాలి పాత శివాలయంలో ఉన్నాయి. ఆ తరువాత రామకృష్ణకవి తెనాలిని వదిలి పలు ప్రాంతాలలో నివసించారు. ఈ క్రమంలో గురుదేవ చోడరాజు పాలించిన ప్రాంతంలో కూడా కొంత కాలం నివసించారు. వీరి కొలువులో విరూరి వేదాద్రి అనే అతని ఉద్యోగిగా ఉండేవాడు. ఆయన రామకృష్ణకవిని ఎంతగానో ఆదరించి ప్రోత్సహించారు. ఆ సమయంలోనే రామకృష్ణకని పాండురంగ మహాత్యం ప్రబంధాన్ని రచించాడు. స్కాంద పురాణంలోని విఠలుని స్తుతిస్తూ రాసిన పాండురంగ మహాత్మ్యల ప్రబంధాన్ని వేదాద్రిగారికి అంకితమిచ్చారు.

తెనాలి రామకృష్ణుడు మహాకవి అనడంలో ఎటువంటి సందేహంలేదు. అయితే వికటకవిగా ప్రసిద్ధి చెందిన తెనాలి రామకృష్ణనవి తన కవితా శక్తి రచించిన గ్రంథాల కంటే హాస్య కథల వలన ఎక్కువ ప్రాచుర్యం పొందాడంటే అతిశయోక్తి కాదు.

ఈ కథలను రామకృష్ణకవి రచించాడో? కల్పిత కథలో? కచ్చితంగా ఎవరూ చెప్పలేదు. ఇది కల్పిత కథలా? వాస్తవాలా? అనడానికి తగిన ఆధారాలు కూడా లేవు. తెనాలి రామకృష్ణుని కథలలో చమత్కారం. యుక్తి, హాస్యం ఉండటంతో పిల్లలే కాక పెద్దలు సైతం ఎంతో ఉల్లాసంగా చదువుతారు. నిత్య జీవితంలో బతకడానికి తెలివితేటలు ప్రదర్శించే మార్గాలు ఈ కథల్లో ఎన్నో కనిపిస్తాయి. చక్కని తెలుగుదనం ఉట్టిపడే తెనాలి రామకృష్ణకవి కథలు భారతీయ భాషలన్నింటికి అనువదించారు. తెనాలి రామకృష్ణుడి కథలు నీతి హాస్యం, చమత్కారంతో నిండి పిల్లలు, పెద్దలను ఆకర్షిస్తాయి. ఈ కథలు పుస్తకాలు, టీవీ సీరియల్స్, సినిమాల ద్వారా ప్రజాదరణ పొందాయి. 1956లో తెనాలి రామకృష్ణ సినిమా, ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు నటనతో విజయవంతమైనది. ఆయన జీవితం, రచనలు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచాయి.

తెనాలి రామకృష్ణుడు కేవలం కవి మాత్రమే కాక, తన హాస్యం, తాత్విక దృష్టి సామాజిక సమస్యలను చమత్కారంగా పరిష్కరించే సామర్థ్యంతో తెలుగు సంస్కృతిలో ఒక ఐకాన్‌గా మిగిలారు.

- షేక్ అబ్దుల్ హకీం జాని

వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు, గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

మేషం

ఈ వారం కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగాలు చేస్తున్న వారికి ఉద్యోగం పర్మినెంట్ అవుతుంది. నిత్యం సర్పదోష నివారణ కంకణం ధరించడం వలన సర్వదోషాలు తొలగిపోతాయి. దుష్ప్రచారాలను పట్టించుకోకుండా మీ పని మీద మీరు చేసుకు పోవడంవల్ల సానుకూల ఫలితాలను సాధిస్తారు. చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి.

వృషభం

ఈ వారం ఈ వారం అనుకూల ఫలితాలను ఎక్కువగా సాధించగలుగుతారు. న్యాయపరమైన చిక్కులలో చిక్కుకున్న మీవారిని రక్షించవలసిన బాధ్యత మీపైన పడుతుంది. ఆర్థికంగా పూర్తిస్థాయిలో కాకపోయినా కొంతవరకు ఊరటను చెందుతారు. కాలం అనుకూలంగా మారుతున్నట్లుగా భావిస్తారు. నిత్యం దీపారాధన కుందిలో రెండు చుక్కలు పరిమళ గంధం చుక్కలు వేయండి.

మిథునం

ఈ వారం ముఖ్యమైన కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయగలుగుతారు. మీ నిజాయితీని ఋజువు చేసుకోగలుగుతారు. పరోపకార బుద్ధిని కలిగి ఉంటారు. నిత్యం నాగబంధాన్ని ఉపయోగించండి. వ్యాపార పరంగా లాభాలు రొటీషన్ల రూపంలో ఉంటాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు.

కర్కాటకం

ఈ వారం భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. నూతన ప్రయత్నాలు నిదానంగా ఫలిస్తాయి. మీలోని ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి, పాత బాకీలు వసూలవుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. నిత్యం యజ్ఞభస్మాన్ని ధరించటం వలన యజ్ఞం చేసిన ఫలితం లభిస్తుంది. రాజకీయమైన వ్యూహాలు అంతగా లాభించవు.

సింహం

ఈ వారం ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలలో సీటు లభించడం కష్టం అవుతుంది. దీర్ఘకాలిక సమస్యలు ఎదురైన చికాకులు పెడతాయి. ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. శ్రమకు తగిన ఫలితం కలుగుతుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. ప్రతి రోజు యోగా, సూర్యనమస్కారాలు చేయండి. నిత్యం జువ్వాదితో పూజిస్తే మంచి ఫలితాలు వుంటాయి.

కన్య

ఈ వారం పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. ప్రత్యర్థులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. నిత్యం ఐశ్వర్యనాగినిని ఉపయోగించడం వలన లక్ష్మి కటాక్షం కలుగుతుంది. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు. కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు.

తుల

ఈ వారం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఇంటా బయటా ఒత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యం, వాహనాల విషయాలలో చాలా జాగ్రత్తలు అవసరం. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు. ఉద్యోగాలలో ఎదురైన చికాకులు తొలుగుతాయి. భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. నిత్యం సౌరకంకణం ధరించండి.

వృశ్చికం

ఈ వారం రాజకీయ, కళారంగాలలోని వారికి అత్యంత యోగదాయకంగా ఉంటుంది. ఇంట్లో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. మిత్రులు సైతం శత్రువులుగా మారి సమస్యలు సృష్టించవచ్చును. ముఖ్యమైన పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్పలాభాలు పొందుతారు. నిత్యం నాగబంధాన్ని ఉపయోగించడం వలన మేలు జరుగుతుంది.

ధనస్సు

ఈ వారం ఉద్యోగాలలో స్థాన చలనం వుంటుంది. భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. పనులు నిదానంగా పూర్తి చేస్తారు. శ్రమ తప్ప ఫలితం వుండదు. నిత్యం దైవకార్యక్రమాలలో ప్రథమ తాంబూలము వాడండి. భాగస్వామ్య వ్యాపారాలు విస్తరిస్తారు. సంఘంలో గౌరవం పొందుతారు.

మకరం

ఈ వారం రాజకీయ, కళారంగాలలోని వారికి కొంతవరకు అనుకూలంగా ఉంటుంది. ముఖ్యమై వ్యవహారాలలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. ఋణాలు తీరుస్తారు. ఆరోగ్యం పట్ల మెలుకువ చాలా అవసరం. ఉద్యోగాలలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. పెట్టుబడుల విషయాలలో తొందరపాటు నిర్ణయాలు వద్దు. నిత్యం శక్తికంకణం ధరించండి.

కుంభం

ఈ వారం బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకుంటారు. నిత్యం దీపారాధన కుందిలో రెండు చుక్కలు వేయుటం వలన అన్ని విధాలా మంచిది. రుణాలు తీరుతాయి. పిల్లలు అభివృద్ధిలోకి వస్తారు. కోర్టు కేసుల నుండి విముక్తి పొందుతారు. ప్రముఖుల నుండి వచ్చిన వార్త వలన కొంత సంతోషం కలుగుతుంది. ముఖ్యమైన పనులు సాఫీగా సాగుతాయి.

మీనం

ఈ వారం ఆదాయ మార్గాలు పెరుగుతాయి. ఇతరుల విషయాలలో జోక్యం తగదు. భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి సాధిస్తారు. ఉద్యోగులు ఇంక్రిమెంట్లు పొందుతారు. రాజకీయ, కళా పారిశ్రామిక రంగాలలో వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. దూరప్రాంతాల నుండి వచ్చిన శుభవార్తలు ఆనందం కలిగిస్తాయి.

ఈ వారం 'కార్టూన్స్'


మా తమ్ముడు.. కొత్తగా
మిషన్ కొన్నాడు.. గుర్తుందిగా..!!?
డాక్టరు.

ఈ రోజు నుండి మనం 'పార్ట్‌నర్స్' అంట!
మరి నా 'వాటా' ఎంతో తేల్చండి ముందు!!


సరిగ్గా ఆరు నెలలకు అలారం పెట్టాను..
అప్పుడు లేచి మొరుగుదాం.. పడుకోండి!!

ఫోటో ఫీచర్

ఇంద్రధనస్సును తలపిస్తున్న ఈ చిత్రాలు తైవాన్‌లోని ఓ చిన్న గ్రామంలోనివి. ఆ ఊళ్లో ప్రతి ఇల్లూ, రోడ్డూ ఒకటేమిటి ఊరంతా రంగుల హరివిల్లులా ఉంటుంది. అందువల్ల ఆ ఊరిని రెయిన్‌బో విలేజ్ అని పిలుస్తారు.